తెలంగాణ

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ముచ్చట్లు

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | ఆదివారం-04- జనవరి 2026 | సంపుటి : 3 | సంచిక : 217 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




## తప్పుడు చరిత్ర రాసే ప్రయత్నంలో కేంద్రం

### టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

- తప్పుడు చరిత్ర రాయడానికి కేంద్రం ప్రయత్నిస్తోందన్న ఆరోపణ
- ఉపాధి హామీ చట్ట మార్పులపై కాంగ్రెస్ తీవ్ర ఖండన
- ఉపాధి హామీ నుంచి గాంధీ పేరు తొలగింపు హేయమని విమర్శ
- పేదలకు జీవనాధారం కల్పించిన చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకే అధికంగా లబ్ధి చేకూరిందన్న వెల్లడి
- ఉపాధి హామీ నిధులపై భారం వేయడం అన్యాయమని ఆగ్రహం

2లో

# కృష్ణా జలాలపై చర్చకు పిలిచినా
# కేసీఆర్ గైర్హాజరు

### అసెంబ్లీకి రాకుండా బీఆర్ఎస్ నేతలు తప్పించుకుంటున్నారని సీఎం విమర్శ

- బహిరంగ సభలు కాదు.. సభలోనే నిజాలు తేల్చుకుందామన్న రేవంత్‌రెడ్డి
- కృష్ణా నదీ జలాలపై చర్చ కోరింది బీఆర్ఎస్ఎల్పీనే: సీఎం స్పష్టం
- కేసీఆర్ సభకు రాకపోవడానికి కారణమే లేదన్న రేవంత్‌రెడ్డి
- హరీశ్‌రావుకు మాట్లాడే అవకాశం ఇచ్చినా సభను వదిలి వెళ్లారన్న ఆరోపణ
- సభకు వస్తే ప్రజలే నిజానిజాలు తేల్చేవారని వ్యాఖ్య
- కేసీఆర్ దగ్గరున్న సమాచారం ప్రభుత్వానికి ఇవ్వాలని ఆశించామన్న సీఎం
- కృష్ణా–గోదావరి జలాలపై ప్రత్యేక చర్చలు పెట్టాలని ప్రభుత్వ యోచన
- రెండేళ్లుగా ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడంపై ప్రశ్నలు
- జానారెడ్డి, భట్టి విక్రమార్క సభలో పోషించిన పాత్రను గుర్తు చేసిన సీఎం



హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు): బీఆర్ఎస్ నేతలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభకు రాకుండా గులాబీ పార్టీ నేతలు తప్పించుకుతిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. బహిరంగ సభల్లో మాట్లాడటం కాదని.. సభకు రండి నిజాలు ఏంటో తేలుద్దామని సవాల్ విసిరారు. అసెంబ్లీలో కృష్ణా నది జలాలపై చర్చ పెట్టమని తాము అడగలేదని ప్రస్తావించారు. బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో ఆ పార్టీ అధినేత కేసీఆర్ అడిగారని చెప్పుకొచ్చారు. అందుకే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి కృష్ణా నదీ జలాలపై చర్చిస్తున్నామని స్పష్టం చేశారు. శనివారం అసెంబ్లీలో 'నీళ్లు నిజాలు'పై జరిగిన స్వల్పకాలిక చర్చలో భాగంగా మాట్లాడారు సీఎం రేవంత్‌రెడ్డి.

మిగతా 2లో



## కొండగట్టు అంజన్న.. నా ప్రాణదాత

- స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు
- అపలు అభివృద్ధ ఇపనులకు పవన్ కళ్యాణ్ శంకుస్థాపన

జగిత్యాల,జనవరి3 (తెలంగాణ ముచ్చట్లు): కొండగట్టు అంజన్న దయ వల్లనే తాను ప్రాణాలతో బయటపడ్డానని, ఆయనంటే తనకు ఎన్నలేని భక్తి విశ్వాసాలని ఏపీ ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామిని శనివారం పవన్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

2లో

## అందెశ్రీ కుటుంబానికి అండగా తెలంగాణ ప్రభుత్వం

### చట్ట సవరణ బిల్లు ప్రవేశం

- 1994 పబ్లిక్ సర్వీస్ కమిషన్ చట్టంలో మార్పులు
- అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- చట్టపరమైన మద్దతు అవసరమని ప్రభుత్వ స్పష్టీకరణ
- 7991 మంది తాత్కాలిక ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ప్రస్తావన
- వెనుక తేదీ నుంచి రెగ్యులరైజేషన్‌పై ఆర్థిక భారం హెచ్చరిక
- ఏపీ ఉదాహరణతో ప్రాస్పెక్టివ్ సవరణపై వివరణ
- ఆర్డినెన్స్ 88కు బిల్ నంబర్ 7 ద్వారా సభ ఆమోదం కోరింపు



హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రముఖ కవి అందెశ్రీ కుటుంబానికి అండగా నిలవాలని భావించింది. ఇందులో భాగంగా అందెశ్రీ కుమారుడికి ఉద్యోగ అవకాశం కల్పించడానికి వీలుగా 1994 ప్రభుత్వ

మిగతా 2లో

## ఒక్క నీటి చుక్కనూ వదలం

- అసెంబ్లీలో కృష్ణా నదీ జలాలపై లఘు చర్చ
- ఒక్క చుక్క నీరు కూడా వదులుకోబోమన్న ఉత్తమ్ స్పష్టం
- బీఆర్ఎస్ హయాంలోనే తెలంగాణకు అన్యాయం జరిగిందన్న ఆరోపణ
- 299 టీఎంసీల ఒప్పందంపై కేసీఆర్‌పై విమర్శలు
- బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు తెలంగాణ బలమైన వాదనలు
- కృష్ణా నీటిలో తెలంగాణకు 72 శాతం వాటా డిమాండ్



హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ అసెంబ్లీలో కృష్ణా నదీ జలాల హక్కులపై లఘు చర్చ ప్రారంభమైంది. ఈ సందర్భంగా రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కృష్ణా నదీ జలాల విషయంలో గొప్పగా చేశామంటూ బీఆర్ఎస్ పార్టీ చెప్పుకుంటోందని విమర్శించారు. కృష్ణా నదీ జలాల్లో ఒక్క నీటి చుక్క కూడా వదులుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలంగాణ హక్కులను కాపాడటంలో ఎక్కడా రాజీపడబోమని తేల్చిచెప్పారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనే కృష్ణా జలాలపై తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని మంత్రి ఆరోపించారు. తెలంగాణకు 299 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలుగా నీటి వాటాలపై బీఆర్ఎస్ ప్రభుత్వ

మిగతా 2లో



## ఎమ్మెల్యే కూనంనేని బేషరతుగా క్షమాపణలు చెప్పాలి

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు): ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై సీపీఐ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలు హేయమైనవని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై, దేశాభివృద్ధికి అహోరాత్రులు కష్టపడుతూ, అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ గౌరవాన్ని దార్శనిక నాయకుడు మోదీ పెంచుతున్నారని అన్నారు. అలాంటి వ్యక్తిపై ప్రజాప్రతినిధి అయిన కూనంనేని.. అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని పేర్కొన్నారు.

2లో



## నరాలు చచ్చుపడినా.. న్యూరాలింక్‌తో రిపేర్ సాధ్యమే

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు): మానవ మెదడులో ఎలక్ట్రానిక్ చిప్‌ను అమర్చే ప్రయోగాలను ప్రపంచ కుబేరుడు ఎలాన్‌మస్క్‌కు చెందిన బ్రెయిన్‌ఇంటర్‌ఫేస్ కంపెనీ న్యూరాలింక్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే పలువురికి ఆ చిప్‌ను అమర్చారు. దీనిద్వారా శరీర పనితీరును పూర్తిగా పునరుద్ధరించడం సాధ్యమవుతుందని తాజాగా మస్క్ విశ్వాసం వ్యక్తంచేశారు.

మిగతా 2లో

## కాంగ్రెస్ మా సహజ మిత్రుడు.. విజయ్ టీవీకే సంకేతాలు

- తమిళనాడు ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు సంకేతాలు
- టీవీకే–కాంగ్రెస్ విధానాల్లో సారూప్యత
- విజయ్–రాహుల్ గాంధీ స్నేహంపై ఫెలిక్స్ వ్యాఖ్యలు
- పొత్తుకు ముందు చర్చించాల్సిన అంశాలున్నాయన్న టీవీకే
- తమిళనాడు కాంగ్రెస్‌పైనే ప్రతిష్టంభన ఆరోపణ
- డిసెంబర్ 25న టీవీకే కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తల పాల్గొనడం
- 2024లో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా టీవీకే ఆవిర్భావం
- టీవీకే ఎంట్రీపై డీఎంకే ధీమా



హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు): ఈ ఏడాది జరుగునున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో చేతులు కలిపే అవకాశాలున్నాయని నటుడు విజయ్ పార్టీ తమిళగ వెట్రి కళగం సంకేతాలు ఇచ్చింది. టీవీకే జాతీయ ప్రతినిధి ఫెలిక్స్ గెరాల్డ్ మాట్లాడుతూ, లౌకికవాదం, మతత్వానికి వ్యతిరేకంగా చేసే పోరాటం విషయంలో కాంగ్రెస్‌టీవీకే విధానాలు ఒకేలా ఉంటాయని, ఆ పరంగా రెండు పార్టీలు సహజ భాగస్వాములని చెప్పారు.

మిగతా 8లో



## తెలంగాణలో అభివృద్ధి జాడేది

2లో

- సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యంపై ప్రశ్నలు
- సూర్యాపేట జిల్లాలో 'జనం బాటలో' కవిత పర్యటన
- ప్రజలు, రైతులతో ముఖాముఖి సమావేశం
- జిల్లా అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదన్న ఆరోపణ
- అర్వపల్లి కేజీవీబీ స్కూల్ పరిస్థితిపై నిలదీత
- రుద్రమదేవి చెరువుకు గోదావరి నీళ్ల అవసరం
- ఎస్సారెస్పీ స్టేజ్–2లో రిజర్వాయర్ల నిర్మాణంపై డిమాండ్



## యూట్యూబర్ అన్వేష్ చుట్టూ బిగుస్తున్న ఉచ్చు!

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు): నమస్తే ఫ్రెండ్స్. నాపేరు అన్వేష్. నేను ప్రపంచ యాత్రికుడిని. వెల్కమ్ టు మై ఛానల్ నా అన్వేషణ. నా కళ్లతో మీకు చూపిస్తాను ప్రపంచాన్ని' అంటూ ప్రపంచ దేశాల్లో వింతలు, విశేషాల గురించి వివరించే యూట్యూబర్ అన్వేష్ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఇప్పటికే వరుస వివాదాలు, క్షమాపణలు, సబ్‌స్క్రైబర్ల సంఖ్య భారీ పడిపోయింది.

8లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక



# తప్పుడు చరిత్ర రాసే ప్రయత్నంలో కేంద్రం

## టీపీసీసీ చీఫ్


హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

కేంద్ర ప్రభుత్వం తప్పుడు చరిత్రను రాసే ప్రయత్నం చేస్తోందన్నారు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్. ఉపాధి హామీ చట్టంలో మార్పులు తేవడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తుంది. ఉపాధి హామీ పథకానికి గాంధీ పేరు తొలగించడం హేయమైన చర్య అంటూ తీవ్ర విమర్శలు గుప్పించారు.

టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తాజాగా మీడియాతో మాట్లాడుతూ..'మహాత్మాగాంధీ మన దేశంలోనే కాదు.. ప్రపంచం గర్వించదగిన త్యాగశీలి. ఉపాధి హామీ చట్టంలో మార్పులు తేవడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తుంది. కేంద్రం.. దేశం కోసం ప్రాణాలు అర్పించిన గాంధీ, దేశ స్వాతంత్రం కోసం 12 ఏళ్ళు జైలు జీవితం గడిపిన నెహ్రూలను మరిపించే ప్రయత్నం చేస్తుంది. దేశంలో వలసల నివారణ కోసం సోనియా గాంధీ తీసుకువచ్చిన గొప్ప చట్టం ఇది. పేదలకు ఉపాధి హక్కును కల్పించి జీవనోపాధిని కల్పించింది. 20 ఏళ్లుగా కోట్ల మంది ఆకలి తీర్చిన చట్టం ఇది.

ఉపాధి హామీ పనుల్లో 90 శాతం మంది లబ్ధిదారుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలే ఉన్నారు. 62 శాతం మంది మహిళలు లబ్ది పొందారు. పేదలకు ఆపన్న హస్తంలా నిలిచిన ఉపాధి హామీని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ వస్తుంది. ఒక తెలంగాణలోనే గత ఏడాది 6 కోట్ల విలువైన పని దినాలు తగ్గించారు. పేదల పొట్ట కొట్టి కార్పోరేట్ శక్తులను పెంచి పోషించడమే బీజేపీ విధానం. పెట్రోల్, డీజిల్ రేటు మూడింతలు పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్ క్రూడాయిల్ ధరలు తగ్గినా.. దేశంలో రేటు పెరుగుతుంది. కేంద్ర ఆర్థిక విధానాల వల్ల రాష్ట్రాల ఆదాయ వనరులు తగ్గాయి. ఇది చాలదు అన్నట్లు ఉపాధి హామీ నిధుల్లో 40 శాతం భారం వేయడం అన్యాయం. కేంద్రం చర్యల వల్ల ఒక్క తెలంగాణ మీదే 1800 కోట్ల అదనపు భారం పడుతుంది' అని కామెంట్స్ చేశారు.

# కృష్ణా జలాలపై చర్చకు పిలిచినా కేసీఆర్ గైర్హాజరు



(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్ సభకు ఎందుకు రాలేదో కారణమే లేదని అన్నారు. హరీశ్‌రావుకు మాట్లాడే అవకాశాన్ని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చారని.. అయినా తాము సభకు రామని వెళ్లిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని తమను కోరారని.. అయితే మీ బట్టలు ఊడదీస్తామని ఒకరు, తోలు తీస్తామని మరొకరు మాట్లాడారని.. ఇప్పుడేమో కుంటిసాకులు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. సభకు వచ్చి చర్చలో పాల్గొంటే ఎవరి బట్టలు ఎవరు ఊడదీయాలో ప్రజలే తేల్చేవారని అన్నారు. ప్రాజెక్టులపై నిలదీస్తామన్న కేసీఆర్ సభకు ఎందుకు రాలేదని ప్రశ్నల వర్షం కురిపించారు సీఎం రేవంత్‌రెడ్డి. సభకు వచ్చి కేసీఆర్ దగ్గర ఉన్న సమాచారం ప్రభుత్వానికి ఇస్తారనుకున్నామని.. కానీ అసెంబ్లీకి ఎందుకు రావట్లేదో కారణం చెప్పాలని నిలదీశారు. కేసీఆర్ సూచనలు ఇస్తే తీసుకుందామని తాము అనుకున్నామని తెలిపారు. కృష్ణానీటిపై ఒకరోజు, గోదావరి నీటిపై మరో రోజు చర్చ పెట్టాలని అనుకున్నామని చెప్పారు. రెండేళ్లుగా ప్రతిపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. సభకు వచ్చి కేసీఆర్ అనుభవాలు తమతో పంచుకోవాలని తాను పదేపదే ఆయన్ను కోరుతున్నామని అన్నారు. గతంలో మాజీ మంత్రి జానారెడ్డి, మల్లు భట్టి విక్రమార్క పోషించిన పాత్ర పోషించాలని తాము కోరామని తెలిపారు. జానారెడ్డి, భట్టిలను ఆనాడు అవమానించినా భరించి సభకు వచ్చి సలహాలు ఇచ్చారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు.

# కొండగట్టు అంజన్న.. నా ప్రాణదాత

- స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు
- అపలు అభివృద్ధ ఇపనులకు పవన్ కళ్యాణ్ శంకుస్థాపన



జగిత్యాల,జనవరి3 (తెలంగాణ ముచ్చట్లు): కొండగట్టు అంజన్న దయ వల్లనే తాను ప్రాణాలతో బయటపడ్డానని, ఆయనంటే తనకు ఎన్నలేని భక్తి విశ్వాసాలని ఏపీ ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామిని శనివారం పవన్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

రూ.35.19 కోట్ల తితిదే నిధులతో భక్తుల వసతి కోసం 96 గదుల ధర్మశాల, దీక్ష విరమణ మండప నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడారు. అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నామంటే దేవుడి దయ ఉండాలి. కొండగట్టు నాకు పునర్జన్మనిచ్చింది. గతంలో జరిగిన విద్యుత్ ప్రమాదం నుంచి నేను ఎలా బయటపడ్డానో ఇప్పటికీ ఆశ్చర్యం కలిగిస్తోంది. కొండగట్టు అంజన్నే నన్ను కాపాడారు. దీక్ష విరమణకు మండపం, సత్రం కావాలని గతంలో నన్ను కోరారు. తితిదే సభ్యులు, తెలంగాణ నాయకులు అందరి సమష్టికృషితోనే ఇది సాధ్యమైంది' అని అన్నారు. కార్యక్రమంలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే కూనంనేని బేషరతుగా క్షమాపణలు చెప్పాలి

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై సీపీఐ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలు హేయమైనవని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై, దేశాభివృద్ధికి అహోరాత్రులు కష్టపడుతూ, అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ గౌరవాన్ని దార్శనిక నాయకుడు మోదీ పెంచుతున్నారని అన్నారు. అలాంటి వ్యక్తిపై ప్రజాప్రతినిధి అయిన కూనంనేని.. అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని పేర్కొన్నారు.

మోదీపై కూనంనేని వ్యాఖ్యలు రాజకీయ దివాళాకోరుతనాన్ని బయటపెట్టాయని విమర్శించారు. రాజకీయాల్లో హుందాతనం, పరిణతి అవసరమని చెప్పుకొచ్చారు. అంతేకానీ ప్రధానమంత్రిపై వ్యక్తిగత ధూషణలు, అర్థంలేని ఆరోపణలు చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తుంటారనే విషయం గుర్తుంచుకోవాలని అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలతో వారికి ప్రజాస్వామ్య విలువలపై, రాజకీయ వ్యవస్థపై ఏవగింపు కలుగుతోందని తెలిపారు. మోదీపై వ్యాఖ్యలకు గానూ కూనంనేని సాంబశివరావు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఈ విషయంపై వెంటనే జోక్యం చేసుకుని మరెవరూ.. ఇలాంటి అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయకుండా, సభా మర్యాదలు పాటించేలా చొరవ తీసుకోవాలని కిషన్‌రెడ్డి కోరారు.

# అందెశ్రీ కుటుంబానికి అండగా తెలంగాణ ప్రభుత్వం



(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగుల నియామకాలు, వేతన నిర్మాణ చట్ట సవరణ బిల్లును రాష్ట్ర శాసన సభలో శనివారం ప్రవేశపెట్టింది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శనివారం ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం సభలో మాట్లాడారు. అందెశ్రీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.

ఇందుకోసం చట్టపరమైన మద్దతు అవసరమని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో 1994పబ్లిక్ సర్వీస్ కమిషన్ చట్టంలోని నిబంధనలు సవరించాల్సి ఉందని తెలిపారు. అందె శ్రీ కుమారుడికి ఉద్యోగ అవకాశం కల్పించడం కోసం చేసిన సవరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టామని వెల్లడించారు. 1994 చట్టంలోని సెక్షన్ 2 ప్రకారం 7991 మంది తాత్కాలిక ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశామని తెలిపారు. అందులో కొందరు ఉద్యోగులు కోర్టుకు వెళ్లి గతం నుంచి రెగ్యులరైజ్ చేయాలని ఆర్డర్ తెచ్చారని ప్రస్తావించారు మల్లు భట్టి విక్రమార్క. గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు 573/225, 1.1.1995కి ఇది విరుద్ధమని చెప్పుకొచ్చారు. వెనుక తేదీ నుంచి రెగ్యులరైజ్ చేస్తే రాష్ట్ర ప్రభుత్వంపై రూ.20వేల కోట్ల అదనపు భారం పడుతుందని వివరించారు. ఏపీలో ఇలాంటి సమస్య వచ్చినప్పుడు ప్రాస్పెక్టివ్‌గా చట్ట సవరణ చేశారని గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వం 25.11.2025న ప్రాస్పెక్టివ్ రెగ్యులరైజేషన్ కోసం ఆర్డినెన్స్ 88 తెచ్చిందని తెలిపారు. ఈ ఆర్డినెన్సును బిల్ నంబర్ 7ద్వారా సభ ఆమోదం కోరుతున్నామని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# ఒక్క నీటి చుక్కనూ వదలం

(మొదటి పేజీ తరువాయి)



హయాంలోనే సంతకాలు చేశారని గుర్తుచేశారు. అంతేకాదు తెలంగాణకు కేవలం 34 శాతం నీళ్లు సరిపోతాయని కేసీఆర్, హరీష్ రావులు అంగీకరించారని విమర్శించారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇరిగేషన్ పేరుతో రూ.1.80 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేశారని వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 299 టీఎంసీలకు ఒప్పుకుని తెలంగాణకు మరణశాసనం రాసినట్లయ్యిందని మంత్రి మండిపడ్డారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు 783 టీఎంసీలు కేటాయించాలంటూ ప్రభుత్వం బలమైన వాదనలు వినిపిస్తోందని స్పష్టం చేశారు. కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో దాదాపు 73 శాతానికి పైగా భూభాగం తెలంగాణలోనే ఉందని పేర్కొన్నారు.

పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు రూ.83 వేల కోట్లకు పైగా ఖర్చు అవుతోందన్నారు. ఇప్పటికీ మట్టి, కాంక్రీట్ పనులు మిగిలి ఉన్నాయన్నారు. మూడేళ్లలో పూర్తి కావాల్సిన ప్రాజెక్టులో కేవలం 35 శాతం పనులే జరిగాయని విమర్శించారు. కుర్చీ వేసుకుని కూర్చుంటా అని కేసీఆర్ అన్నారని, ఆ కుర్చీ ఎక్కడ పోయిందో, కేసీఆర్ ఎక్కడికి వెళ్లారో చెప్పాలని ఎద్దేవా చేశారు. మూడేళ్లలో పూర్తి చేస్తానని చెప్పి ప్రజలను మోసం చేశారని మంత్రి ఆరోపించారు. కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు రూ.41 వేల కోట్లు, గోదావరి బేసిన్ ప్రాజెక్టులకు రూ.1.20 లక్షల కోట్లను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఖర్చు పెట్టిందని ఉత్తమ్ వెల్లడించారు. అయితే కాళేశ్వరం ప్రాజెక్టులో ఒక్క టీఎంసీ కూడా అదనంగా పెంచారని.. అదే సమయంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో టీఎంసీలను తగ్గించారని మండిపడ్డారు.

ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణా నదీ జలాలపై బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు త్వరలో వెలువడనుందని మంత్రి తెలిపారు. తాను స్వయంగా ట్రిబ్యునల్ వాదనలకు హాజరవుతున్నానని, కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు 72 శాతం వరకు నీటి కేటాయింపులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తెలంగాణకు అత్యంత కీలకమని స్పష్టం చేశారు. మొత్తం 814 టీఎంసీల కృష్ణా నీళ్లను తెలంగాణ, ఏపీకి న్యాయంగా కేటాయించాలన్నారు. తెలంగాణకు కృష్ణా నదిలో 72 శాతం వాటా కావాలని వాదనలు వినిపిస్తున్నామని చెప్పారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కేటాయించిన 45 టీఎంసీల నీళ్లనే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు కేటాయించారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ గోబెల్స్ ప్రచారాన్ని కూడా మించిపోయిందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. 2016లో అపెక్స్ కౌన్సిల్ సమావేశానికి కేసీఆర్ హాజరై 299 టీఎంసీలకు ఒప్పుకున్నారని.. తెలంగాణకు 299 టీఎంసీలు, ఏపీకి 511 టీఎంసీల నీటి కేటాయింపులపై ఒప్పందాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణకు 71 శాతం, ఏపీకి 29 శాతం కృష్ణా నీటి వాటా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.



# తెలంగాణలో అభివృద్ధి జాడేది

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో అభివృద్ధి పనులు జరగడం లేదని.. అయిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంతోనే ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయని ఆరోపణలు చేశారు. శనివారం సూర్యాపేట జిల్లాలో జనం బాటలో భాగంగా కవిత పర్యటించారు. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు, రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈక్రమంలో ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు కవిత.

సూర్యాపేట జిల్లాలో అభివృద్ధి పనులు ఎక్కడవి అక్కడే ఆగిపోయాయని.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. జిల్లా అభివృద్ధిలో ఎలాంటి పాత్ర పోషించాలనే విషయంపై తాను దృష్టి పెట్టానని చెప్పుకొచ్చారు. అర్వపల్లి మండలంలోని కేజీబీవీ స్కూల్‌ను పరిశీలించానని తెలిపారు. గత ఏడాదిలో తుపాను వచ్చి ఈ స్కూల్ మునిగిపోతే కలెక్టర్ వచ్చి పరిశీలించారని.. కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు ఎందుకు తీసుకోలేదని నిలదీశారు కవిత. రాష్ట్రంలో పంట కాల్వల మెయింటెనెన్స్ సరిగా లేదని అన్నారు. కాల్వల్లో కంప చెట్లు పెరిగాయని చెప్పుకొచ్చారు. నీళ్లు రాక అన్నదాతలు ఇబ్బంది పడుతున్న పట్టించుకోరా అని ఫైర్ అయ్యారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విభాగానికి కనీసం నిధులు ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించారు. కోదాడ వరకు నీళ్లు ఇచ్చే డిస్ట్రిబ్యూటరీ కాల్వ 70 కిలోమీటర్లు ఉంటుందని... ఈ కాల్వను సరిగా మెయింటెనెన్స్ ఎందుకు చేయటం లేదని ప్రశ్నించారు. రుద్రమదేవి చెరువు పరిశీలించానని....700 ఎకరాల్లోని ఈ చెరువుకు గోదావరి నీళ్లు రావాల్సి ఉందని తెలిపారు. ఎస్సారెస్పీ స్టేజ్ 2లో భాగంగా నల్గొండ జిల్లాలో రిజర్వాయర్లు రావాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ ప్రాంత రైతాంగానికి మేలు జరిగేలా రిజర్వాయర్లు కట్టే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించాలని కవిత కోరారు.

## నరాలు చచ్చుపడినా.. న్యూరాలింక్‌తో రిపేర్ సాధ్యమే

(మొదటి పేజీ తరువాయి)

మెడ, వెన్నెముకలో నరాలు చచ్చుపడినా నయం చేయడం సాధ్యమేనని వెల్లడించారు. కార్టెక్స్ మెదడులో ఆలోచన, జ్ఞాపకశక్తి నిమగ్నమై ఉండే ప్రాంతం) నుంచి కమ్యూనికేషన్లను అనుసంధానించడానికి ఈ చిప్ సహాయపడుతుందని చెప్పారు. అలాగే పుట్టుకతోనే చూడలేనివారికి చూపును తీసుకువచ్చేలా తమ సంస్థ ప్రయోగాలు వేగంగా సాగుతున్నాయని ఇప్పటికే వెల్లడించారు. 2026లో మనుషులపై ఆ దిశగా ప్రయోగాలు చేయాలనుకుంటున్నట్లు చెప్పారు. ఆ చిప్‌నకు బ్లైండ్ సైట్ అని పేరు పెట్టారు.

మన మెదడు.. శరీరంలోని వివిధ అవయవాలకు నాడీ కణాల (న్యూరాన్లు) ద్వారా సంకేతాలను పంపడం, అందుకోవడం చేస్తుంది. ఈ కణాలు పరస్పరం అనుసంధానమై, ఒక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తాయి. న్యూరో ట్రాన్స్‌మిటర్లు అనే రసాయన సంకేతాలతో ఇవి కమ్యూనికేషన్ సాగిస్తాయి. ఈ ప్రక్రియలో విద్యుత్ క్షేత్రం ఏర్పడుతుంది. మెదడులోని పలు న్యూరాన్లకు సమీపంలో ఎలక్ట్రోడ్లను ఉంచడం ద్వారా వాటిలోని విద్యుత్ సంకేతాలను రికార్డు చేయడం 'న్యూరాలింక్' ప్రాజెక్టు ఉద్దేశం. తద్వారా వాటిని ఆధునిక యంత్రాల నియంత్రణకు ఉపయోగించాలని ఆ సంస్థ భావిస్తోంది. సూటిగా చెప్పాలంటే మెదడులోని ఆలోచన శక్తి సాయంతో మనం యంత్రాలతో అనుసంధానం కావొచ్చు. అలాగే నాడీ, కదలికలకు సంబంధించిన వ్యాధులకు చికిత్స చేయవచ్చు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# మనిగిల్ల ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు





- పాఠశాల అభివృద్ధికి పలు హామీలు
- సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్

**పెద్దమందడి,జనవరి3(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందరం మండలం మనిగిల్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూతన సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ పాల్గొని సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల ఆహ్వానం మేరకు కార్యక్రమానికి హాజరైన నూతన సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్, ఉపసర్పంచ్ ముప్పూరి గణేష్‌లను ఉపాధ్యాయ బృందం శాలువాలతో ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేష్ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే సేవలను వక్తలు ఘనంగా కొనియాడారు.ఈ సందర్భంగా సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ...సావిత్రిబాయి పూలే గొప్ప సంఘ సంస్కర్త, కవయిత్రి, భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు.1848 జనవరి 1న దేశంలో తొలి బాలికల పాఠశాలను స్థాపించి మహిళా విద్యకు నాంది పలికారు. ఆమె జన్మదినమైన జనవరి 3ను జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటారు. అనేక అవమానాలు, అడ్డంకులు ఎదురైనా వందలాది పాఠశాలలు స్థాపించి మహిళలకు విద్యను అందించిన వీరనారి ఆమె అని అన్నారు. విద్యార్థులు సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకుని చదువులో రాణించాలని సూచించారు.ఉపసర్పంచ్ ముప్పూరి గణేష్ మాట్లాడుతూ... విద్యార్థులకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. చదువులో ప్రతిభ చూపే విద్యార్థులకు ప్రోత్సాహకంగా తొలి స్థానంలో నిలిచిన వారికి రూ.10 వేల సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా పాఠశాల సమస్యలను ఉపాధ్యాయులు సర్పంచ్ దృష్టికి తీసుకువెళ్లగా, వాటిని పరిష్కరిస్తానని సర్పంచ్ హామీ ఇచ్చారు.మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో ఉచిత ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, జనవరి 26 గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆటపోటీలు నిర్వహించేందుకు తన సొంత ఖర్చుతో ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. జనవరి 26లోగా పాఠశాల స్టేజ్‌ను విస్తరిస్తామని, అన్యువల్ డే వేడుకల కోసం త్వరలో డాన్స్ మాస్టర్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. అలాగే 1 నుంచి 5 తరగతుల విద్యార్థులు రేకుల కింద చదువుకోవాల్సిన ఇబ్బందులను తొలగించేందుకు పీఓపీ షెడ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్, ఉపసర్పంచ్ ముప్పూరి గణేష్, గ్రామ పెద్దలు ఎస్. రాములు, పోతుల రామిరెడ్డి, దానియేలు, హైస్కూల్ హెచ్ఎం వెంకటేశ్వర్లు, జానయ్య, సుధాకర్ ఆచారి, ఎండి రఫీ, నస్రీన్ బేగం, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం వి.రాములు, లావణ్య, రేణుక, జీకే శ్రీనివాసులు, గ్రామస్తులు కొములయ్య, వెంకటయ్య, తిరుపతయ్య, రామకృష్ణ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, ఆనంద్ రెడ్డి, ఎర్ర తిరుపతయ్య, హరిజన రాములు, హరిజన లక్ష్మయ్య, బోయిన కృష్ణ, బందన్న, బీకే బోడి గణేష్, ముప్పూరి సాయి, ముప్పూరి పవన్, మల్లికార్జున్, అశోక్, హరిజన రాజు, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# తాటికాయల ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా సావిత్రి భాయి పూలే జయంతి వేడుకలు





- మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించిన వార్డు మెంబర్లు

**ధర్మసాగర్,జనవరి03(తెలంగాణ ముచ్చట్లు):** తాటికాయల గ్రామంలోని ప్రభుత్వ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో సావిత్రి భాయి పూలే జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ 3వ, 8వ వార్డు సభ్యులు పట్ల రమేష్, బొల్లెపాక అనిత సంపత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సావిత్రి భాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

అనంతరం మహిళా ఉపాధ్యాయులతో కేకు కట్ చేయించి వేడుకలను మరింత ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఫాతిమా మేరీ మాట్లాడుతూ, మహిళా విద్యకు సావిత్రి భాయి పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. సమాజంలో విద్య ద్వారా మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ఆమె చేసిన కృషి నేటి తరాలకు ఆదర్శమని పేర్కొన్నారు.

వార్డు సభ్యులు పట్ల రమేష్, బొల్లెపాక అనిత సంపత్ మాట్లాడుతూ, మహిళల విద్యాభివృద్ధికి సావిత్రి భాయి పూలే చూపిన దారి ప్రతి ఒక్కరూ అనుసరించాలని తెలిపారు. విద్యే సమాజ పురోగతికి మూలాధారమని, విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నవీన్ కుమార్, వసుందర, శ్రీనివాస్, రాజు, ఇందిరాణి, కల్యాణ్, పీఎస్ హెచ్ఎం వెంకటేశ్వరరెడ్డి, రాజు, హేమలత,గ్రామ యువకులు బొల్లెపాక రమేష్,ప్రవీణ్,నవీన్, నల్ల సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో సావిత్రిబాయి పూలే 195వ జయంతి వేడుకలు






**మేడ్చల్ మల్కాజ్గిరి , జనవరి 03 (తెలంగాణ ముచ్చట్లు):** జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే 195వ జయంతి వేడుకలను జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి అధికారులు పూలమా లలు వేసి నివాళులర్పించారు.బాలికల విద్య, మహిళా సాధికారత కోసం ఆమె చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.కార్యక్రమంలో జిల్లాలోని 13 మంది మహిళా ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించి, వారి సేవలను ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి, జిల్లా జీసీడీఓతో పాటు జిల్లాస్థాయి వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.వక్తలు మాట్లాడుతూ, సావిత్రిబాయి పూలే బాలికల విద్య కోసం చేసిన పోరాటం నేటి సమాజానికి మార్గదర్శకమని, ఆమె ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు.

# పెద్దమందడి గిరిజన గురుకుల పాఠశాల అభివృద్ధికి రూ.3 కోట్ల నిధులు మంజూరు

- ఎమ్మెల్యే సహకారానికి గిరిజన నాయకుల హృదయపూర్వక కృతజ్ఞతలు



**పెద్దమందడి,జనవరి3(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సహకారంతో పెద్దమందడి గిరిజన గురుకుల పాఠశాల అభివృద్ధికి రూ.3 కోట్ల నిధులు మంజూరు కావడం పట్ల కాంగ్రెస్ పార్టీ గిరిజన నాయకులు హర్షం వ్యక్తం చేశారు .ఈ నిధులు విద్యార్థుల కోసం ఆధునిక భోజన డైనింగ్ హాల్ నిర్మాణం, అలాగే టీచింగ్ స్టాఫ్ రూమ్స్ ఏర్పాటు కోసం వినియోగించనున్నట్లు వారు తెలిపారు. దీని ద్వారా విద్యార్థులకు మెరుగైన భోజన సదుపాయాలు లభించడమే కాకుండా, ఉపాధ్యాయులకు అనుకూలమైన వాతావరణం ఏర్పడి, పాఠశాల విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని కూడా పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో గిరిజన కాంగ్రెస్ పార్టీ సర్పంచులు గోపాల్ నాయక్, ఆంజనేయులు నాయక్, మన్యా నాయక్, రామ్ సింగ్ నాయక్, అలాగే మాజీ సర్పంచ్ రాధాకృష్ణ పాల్గొన్నారు. చీకరు చెట్టు తాండ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సునీల్, ముందరతాండ కాంగ్రెస్ నాయకులు కిషన్, తారకరాముడు, మోహన్ పాల్గొని ఎమ్మెల్యే మేఘా రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.కేంద్రం, రాష్ట్రం స్థాయి గిరిజన విద్యాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపి కీలకమైన నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి చొరవను కాంగ్రెస్ పార్టీ గిరిజన నాయకులు ప్రశంసిస్తూ, భవిష్యత్తులో ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు.

# బండారి లక్ష్మారెడ్డికి ధన్యవాదాలు తెలిపిన చిల్కానగర్ డివిజన్ పాస్టర్లు



**చిల్కానగర్, జనవరి 03 (తెలంగాణ ముచ్చట్లు):** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని చిల్కానగర్ డివిజన్ పరిధిలోని వివిధ చర్చిల పాస్టర్లు చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజు, కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజులను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పాస్టర్లు అందరూ కలిసి ప్రత్యేక ప్రార్థన నిర్వహించి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మరియు కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజులపై ఆ ఏసుప్రభు ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. అనంతరం వారిని శాలువాలతో సత్కరించి, కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు.అదనంగా, ప్రతి సంవత్సరం క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాస్టర్లకు నూతన దుస్తులు, క్రిస్మస్ గిఫ్టులు ఎంతో దయా హృదయంతో పంపిణీ చేస్తున్నందుకు గాను పాస్టర్లు ప్రత్యేకంగా ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు. ఆ ఏసుప్రభు ఆశీస్సులు ఆయనపై ఎల్లప్పుడూ ఉండాలని కొనియాడారు.ఈ కార్యక్రమంలో చిల్కానగర్ డివిజన్ పాస్టర్లు గోనె ఫిలిప్స్, జెరూసలెం మత్తయ్య, మనోహర్, జాకోబ్ రాజు, నటానియల్, ఇమాన్యుల్, తేజు మై తదితరులు పాల్గొన్నారు.

# రెట్టింపు ఉత్సాహంతో ముందుకెళ్లాలి మాజీ ఎమ్మెల్యే డాక్టర్.ఎస్.ఎ.సంపత్ కుమార్



**తెలంగాణ ముచ్చట్లు జోగులాంబ గద్వాల్ జిల్లా:**నూతన సంవత్సరంలో రెట్టింపు ఉత్సాహంతో ముందుకెళుతూ పార్టీని బలోపేతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి ఎస్.ఎ సంపత్ కుమార్ పేర్కొన్నారు.

శాంతినగర్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అలంపూర్ మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్‌ను జోగులాంబ గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ సంధ్య బాబు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి 2026వ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువా, పూలమాల వేసి మిఠాయి తినిపిస్తూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆయన సంధ్య బాబుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి ఈ సంవత్సరం రెట్టింపు ఉత్సాహంతో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. మరి కొద్ది రోజుల్లో మున్సిపాలిటీ ఎన్నికలు రాబోతున్న తరుణంలో సోషల్ మీడియాలలో కొంత మంది చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని సూచించారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఒడిదుడుకులు ఎదురైనా అల్లంపూర్ నియోజకవర్గాన్ని సంక్షేమం, అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో బడుగు, బలహీన వర్గాల ప్రజల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకెళ్తుందని తెలిపారు. ఇదే ఒరవడితో క్షేత్రస్థాయిలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎఐసిసి కార్యదర్శిని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ సంధ్య బాబుతోపాటు అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప, వైస్ చైర్మన్ పచ్చర్ల కుమార్, లాల్ గౌడ్, గడుమూరు మోహన్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

# కుషాయిగూడ-నేరేడ్మెట్ పోలీసుల సంయుక్త వాహన తనిఖీలు




- సైనిక్‌పురి ఎక్స్ రోడ్ వద్ద విస్తృత తనిఖీలు

కుషాయిగూడ, జనవరి 03 (తెలంగాణ ముచ్చట్లు): మల్కాజ్గిరి కమిషనరేట్ పరిధిలో కుషాయిగూడ మరియు నేరేడ్మెట్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం సైనిక్‌పురి ఎక్స్ రోడ్ వద్ద విస్తృత వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మొత్తం 25 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.తనిఖీల సందర్భంగా వాహనదారుల లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, బీమా పత్రాలు తదితరాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. సరైన పత్రాలు లేని 15 వాహనాలను గుర్తించి నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకున్నారు.ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, వాహనాలకు సంబంధించిన అన్ని చట్టబద్ధమైన పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని పోలీసులు ప్రజలకు సూచించారు. ప్రజల భద్రత కోసమే ఈ తనిఖీలు చేపడుతున్నామని, భవిష్యత్తులో కూడా ఇలాంటి వాహన తనిఖీలు కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# పెద్దమందడి కస్తూర్బాలో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

**పెద్దమందడిజనవరి3(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండల కేంద్రంలోని కస్తూర్బా వసతి గృహంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే జయంతిని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా దేశవ్యాప్తంగా జరుపుకుంటున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలకు పెద్దమందడి నూతన సర్పంచ్ సూర్య గంగా మాజీ జెడ్పిటిసి వెంకటస్వామి, వార్డు సభ్యులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా పెద్దమందడి సర్పంచ్ సూర్య గంగా రవి మాట్లాడుతూ... భారతదేశంలో మహిళా విద్యకు పునాదులు వేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే.మహిళలు, బాలికలు విద్యావంతులైతేనే సమాజంలో సమానత్వం, సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది. కస్తూర్బా వసతి గృహాల్లో అందిస్తున్న విద్య గ్రామీణ ప్రాంత బాలికల జీవితాలను మార్చుతోంది.విద్యార్థినుల భవిష్యత్తు కోసం అంకితభావంతో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సేవలు అభినందనీయం అని అన్నారు. అనంతరం మాజీ జెడ్పీటీసీ వెంకటస్వామి మాట్లాడుతూ..సావిత్రిబాయి పూలే భారతదేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా మహిళా విద్యకు వెలుగు నింపారు. సామాజిక వివక్షను ఎదుర్కొంటూ విద్య ద్వారానే మార్పు సాధ్యమని నిరూపించారు. ఆమె ఆశయాలు నేటి తరానికి ఆదర్శం. బాలికలు చదువులో ముందుకు సాగేందుకు కస్తూర్బా పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తున్నాయి అని తెలిపారు.సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా కస్తూర్బా వసతి గృహంలో చదువుతున్న విద్యార్థినీలు నృత్యాలతో, డ్యాన్సులతో, అలరించే సాంస్కృతిక ప్రదర్శనలతో వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యార్థినీల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం నూతనంగా ఎన్నికైన పెద్దమందడి సర్పంచ్ సూర్య గంగా రవిని శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఎన్నికైన ప్రజాప్రతినిధులు కస్తూర్బా పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పెద్దమందడి సర్పంచ్ సూర్య గంగా రవి, మాజీ జెడ్పీటీసీ వెంకటస్వామి, వార్డు సభ్యులు కొమ్ము విష్ణు, కొమ్ము బ్రహ్మం ,సింగిరెడ్డి అమల కురుమూర్తి, కొమ్ము సత్య నారాయణ,నీలం రవి, కస్తూర్బా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినీలు పాల్గొన్నారు.





# సత్తుపల్లిలో ఘనంగా మట్టా దయానంద్ పుట్టినరోజు వేడుకలు

- వేలాదిగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు.
- భారీ బైక్ ర్యాలీ – సేవా కార్యక్రమాలు.



**సత్తుపల్లి, జనవరి 3 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి నియోజకవర్గంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పుట్టినరోజు వేడుకలు శనివారం అట్టహాసంగా నిర్వహించారు. సత్తుపల్లి పట్టణంలోని రాణి సెలెబ్రేషన్స్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి సత్తుపల్లి శాసనసభ్యులు మట్టా రాగమయి హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ, ప్రజల ప్రేమాభిమానాలు తమ కుటుంబానికి లభించిన గొప్ప బలం అని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ, యువతను పేకాట, కోడిపందాలు, ఆన్‌లైన్ బెట్టింగ్ వంటి దుష్ప్రవర్తనల బారిన పడకుండా అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గాన్ని సైబర్ నేరగాళ్ల చేతుల్లో పడనివ్వబోమని హెచ్చరించారు.

ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ మాట్లాడుతూ, ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించిన వారిపై విచారణ జరిపి, త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు, టీపీసీసీ అధ్యక్షులకు నివేదిక అందజేస్తామని తెలిపారు.

రాబోయే మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో సత్తుపల్లి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్టా రాగమయి దంపతులు మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు బట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

పుట్టినరోజు వేడుకల్లో భాగంగా వెంగలరావు కాలనీ నుంచి పాత సెంటర్ మీదుగా వేంసూరు రోడ్‌లోని రాణి సెలెబ్రేషన్స్ ఫంక్షన్ హాల్ వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

అనంతరం వేలాది మంది కాంగ్రెస్ శ్రేణుల మధ్య కేక్ కట్ చేశారు. అదే వేదికపై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.

డాక్టర్ మట్టా దయానంద్ పుట్టినరోజు సందర్భంగా సత్తుపల్లి పట్టణంలోని ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు బెంచీలు, మైనారిటీ గురుకుల పాఠశాల హాస్టల్ విద్యార్థులకు టేబుల్ ఫ్యాన్లు అందజేశారు. సత్తుపల్లి పట్టణంతో పాటు సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండలాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో పుట్టినరోజు సంబరాలు ఘనంగా నిర్వహిస్తూ పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ప్రజా బంధువుగా పేరొందిన డాక్టర్ మట్టా దయానంద్ పుట్టినరోజు వేడుకలు వేలాది మంది ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా ముగిశాయి.

# సావిత్రిబాయి పూలే 195వ జయంతి చిత్రపటానికి పూలమాల



**ఏ ఎస్ రావు నగర్, జనవరి 03 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో శనివారం కమలానగర్ సీఐటీయూ కార్యాలయ ప్రాంగణంలో భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 195వ జయంతి సందర్భంగా ఘనంగా సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. ముందుగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సృజన, ఐద్వా జిల్లా కార్యదర్శి వినోద, స్ఫూర్తి గ్రూప్ నాయకురాలు శారద సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు .ఈ సందర్భంగా గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ, సావిత్రిబాయి పూలే జ్యోతిరావు పూలే ప్రోత్సాహంతో విద్యను అభ్యసించి ఉపాధ్యాయురాలిగా శిక్షణ పొంది దళిత బాలికల కోసం పాఠశాలలు స్థాపించి విద్యాబోధన చేశారని తెలిపారు. ఆమె విద్యా ఉద్యమానికి వ్యతిరేకంగా మనువాదులు చేసిన అవమానాలను ఎదుర్కొన్నప్పటికీ వెనుకడుగు వేయకుండా బాలికలకు చదువు చెప్పిన మహోన్నత వ్యక్తి సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. ఆమె 195వ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరపడం ప్రజా ఉద్యమాల ఫలితమని అన్నారు.ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సృజన మాట్లాడుతూ, సావిత్రిబాయి పూలే తన జీవితాన్ని విద్యతో పాటు సేవా కార్యక్రమాలకు అంకితం చేశారని తెలిపారు. నేడు మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నారంటే దానికి పూలే వేసిన పునాదే కారణమని పేర్కొన్నారు. సమాజంలో మహిళలను అవమానించే ధోరణికి వ్యతిరేకంగా ప్రజలంతా పోరాడాలని పిలుపునిచ్చారు. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద మాట్లాడుతూ, సావిత్రిబాయి పూలే చేసిన త్యాగాల ఫలితంగానే మహిళలకు విద్య హక్కు రాజ్యాంగంలో పొందుపరచబడిందని అన్నారు. ఆమె ఆశయాలను నేటి తరాలు ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.కోమటి రవి, జయరాజు, మల్లేశం, శివన్నారాయణ, బలరాం, జగ్గరాజు తదితరులు మాట్లాడుతూ, నిజమైన చదువుల తల్లి సావిత్రిబాయి పూలే అని అభివర్ణించారు. ప్లేగు మహమ్మారి సమయంలో తన కుమారుడు యశ్వంత్ సహకారంతో వందలాది మందికి సేవలు అందించి ప్రాణాలు కాపాడారని, చివరకు అదే వ్యాధితో ఆమె మరణించటం ఆమె త్యాగానికి నిదర్శనమని తెలిపారు. శూద్రులు, మహిళలకు చదువు నిరాకరించిన మనువాద భావజాలాన్ని తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని అన్నారు.అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారంతా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో రుక్కయ్య, దుర్గాచార్యులు, పి. మల్లేశం, ఎం. భాస్కర్ రావు, శశాంక్, మల్లేష్, ఎన్. సృజన, ఎం. వినోద, ఎ. శారద, ఎ. విజయ, సరోజినీ, సపియా సుల్తానా, ఆర్. లక్ష్మి, ఆర్. స్వాతి, మాధవిలత, ఎస్. శోభ, పి. మంగ, నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎం నాయకుల అక్రమ అరెస్టులను ఖండించాలి




- అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన.

**సత్తుపల్లి, జనవరి 3 (తెలంగాణ ముచ్చట్లు):** సిపిఎం నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ సిపిఎం సత్తుపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసనకు సిపిఎం పట్టణ, రూరల్ కమిటీల నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. మధిర, ఖమ్మం నగరాల్లో అర్ధరాత్రి నుంచే సిపిఎం జిల్లా, డివిజన్ స్థాయి నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ ఈ నిరసన చేపట్టినట్లు నాయకులు తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తూ ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా సిపిఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, మధిర పట్టణంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహించేందుకు పోలీసు శాఖ నుండి అనుమతి తీసుకున్నప్పటికీ ర్యాలీ జరగకుండా అడ్డుకోవడం రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన అని విమర్శించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మల్లు నందినిలు హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో సిపిఎం మంచి ఫలితాలు సాధించడంతో అనేక గ్రామాల్లో దాడులకు పాల్పడుతూ నాయకులపై అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపుతున్నారని అన్నారు. దీనికి నిరసనగా చేపట్టిన శాంతియుత ర్యాలీలను విచ్ఛిన్నం చేసి భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని విమర్శించారు. సిపిఎం పార్టీగా ఈ అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండు రంగారావు, జాజిరి శ్రీనివాస్, సిపిఎం నాయకులు కొలికపోగు సర్వేశ్వరరావు, రావుల రాజబాబు, మోరంపూడి వెంకట్రావు, చావా రమేష్, మల్లూరి చంద్రశేఖర్, వలి, అర్జున్, భాస్కర్ పాల్గొన్నారు. అలాగే మహిళా సంఘం నాయకులు తన్నీరు కృష్ణవేణి, శీలం కరుణ, సత్తుపల్లి సిపిఎం మండల కార్యదర్శి జాజిరి జ్యోతి, పుష్పవల్లి, నాగమణి, రజిని, లక్ష్మణ్, సనందన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వీ కర్ణన్ ను కలిసిన పరమేశ్వర్‌రెడ్డి




_ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతి

**ఉప్పల్, జనవరి 03 (తెలంగాణ ముచ్చట్లు):** జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వీ కర్ణన్‌ను ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఉప్పల్ నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కమిషనర్‌తో చర్చించిన పరమేశ్వర్‌రెడ్డి, అవసరమైన నిధులను వెంటనే కేటాయించాలని కోరారు. అలాగే ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు తగిన నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ ప్రజలకు మౌలిక సదుపాయాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# జోనల్ కమిషనర్ రాధికా గుప్తాకు వినతి పత్రం అందజేసిన కార్పొరేటర్ ప్రభుదాస్




**ఉప్పల్, జనవరి 03 (తెలంగాణ ముచ్చట్లు):** జిహెచ్ఎంసి ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తాను మీర్పేట్ హెచ్.బి కాలనీ కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ మర్యాదపూర్వకంగా కలసి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ప్రభుదాస్ మాట్లాడుతూ, వినతి పత్రంలో బండ బావి సెకండ్ ఫేజ్‌కు సంబంధించిన ప్రపోజల్‌తో పాటు కృష్ణానగర్, బీకే నగర్ ప్రాంతాల్లోని పార్కుల అభివృద్ధి అంశాలు, అలాగే రాజీవ్ పార్కు నిర్వహణ (మెయింటెనెన్స్) విషయాలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు.ప్రజలకు మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడేలా సంబంధిత పనులను త్వరితగతిన చేపట్టాలని ఈ సందర్భంగా కమిషనర్‌ను కోరినట్లు ఆయన తెలిపారు.

## ఆటో డ్రైవర్లను ఆదుకోవాల్సిన ప్రభుత్వము అరెస్టు చేయడం అప్రజాస్వామికం



◆ ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు రేణుకుంట్ల దుర్గాప్రసాద్.

**హసన్ పర్తి,జనవరి 03(తెలంగాణ ముచ్చట్లు):** హసన్ పర్తి మండలం లోని వివిధ ఆటో కార్మిక సంఘాల నాయకుల అరెస్టును ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు రేణుకుంట్ల దుర్గా ప్రసాద్ ఖండిచారు.ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ


కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీని రెండేళ్లు అయినా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన ఆటో సంఘాల నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆటో డ్రైవర్ జీవితాలు ఆగమైతున్నాయని కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్ల జీవనోపాధి కష్టమైందని ఆటో డ్రైవర్లలకు ఇస్తామన్న 12 వేల నగదు సాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మరిచిందని విమర్శించారు. ఆటో నడిపినా ఇల్లు గడవకపోవడంతో వందలాదిమంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీ అమలు మరిచి, వారి డిమాండ్ల సాధన కోసం ఉద్యమిస్తున్న ఆటో డ్రైవర్లను అరెస్టు చేయడం అప్రజాస్వామికం జిల్లా వ్యాప్తంగా అరెస్ట్ చేసిన ఆటో డ్రైవర్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో తాళ్ల మధు,అరెల్లి స్వామి,మట్టెడ స్వామి,గాజుల రాజు ఉన్నారు.

## సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయులకు సన్మానం



**కాప్రా, జనవరి 03 (తెలంగాణ ముచ్చట్లు):** కాప్రా డివిజన్ పరిధిలోని ఎంపీయూపీఎస్ కాప్రా హెచ్‌డబ్ల్యూ పాఠశాలలో భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సేవలందిస్తున్న మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు.ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బత్తుల శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ, మహిళా విద్యాభివృద్ధికి సావిత్రీబాయి పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆమె చూపిన మార్గాన్ని నేటి ఉపాధ్యాయులు అనుసరించి విద్యార్థులను సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. మహిళా ఉపాధ్యాయులు విద్యతో పాటు విలువలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలరాజు, రాఘవేందర్ గౌడ్, వేణు మాధవ్ , విద్యార్థులు పాల్గొని సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులు మంజుల, రమ, సాయి లక్ష్మిని శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమం విద్యార్థుల్లో మహిళా విద్య ప్రాముఖ్యతను మరింత పెంపొందించేలా విజయవంతంగా ముగిసింది.

## కాప్రాలో శ్రీ వెంకటేశ్వర పద్మావతి అమ్మవార్ల కళ్యాణ మహోత్సవం



◆ భక్తిశ్రద్ధలతో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**కాప్రా, జనవరి 03 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా డివిజన్ పరిధిలోని తిరుమల శివపురి కాలనీ, విల్లా నెంబర్-73లో శ్రీ వెంకటేశ్వర స్వామి - పద్మావతి అమ్మవార్ల కళ్యాణ మహోత్సవం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఎం.ఏ. శంకర్ కాలనీ వైస్ ప్రెసిడెంట్, జేఏసీ కాప్రా డివిజన్ కన్వీనర్ ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే ఈ కార్యక్రమానికి విచ్చేశారు. ఆలయ వాతావరణం భక్తి పారవశ్యంతో నిండిపోయింది. ఈ కార్యక్రమంలో కాప్రా ?డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నవీన్ గౌడ్, నల్ల రాధాకృష్ణతో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివార్ల ఆశీస్సులు పొందారు.





# కష్టాల్లో ఉన్నవారికి 'మనోజ్' ధైర్యం

◆ మృతుడి కుటుంబానికి... రోగులకు ఆర్థిక భరోసా
◆ మానవత్వాన్ని చాటుకుంటున్న 'మీ శ్రేయోభిలాషి బృందం

**ఖమ్మం బ్యూరో, జనవరి 03,(తెలంగాణ ముచ్చట్లు):** కష్టాల్లో ఉన్నామన్న పిలుపు విన్నా.. కన్నీరు పెడుతున్న దీన గాథ కంట పడ్డా.. 'మేమున్నాం' అంటూ ఆపన్నహస్తం అందిస్తోంది 'మీ శ్రేయోభిలాషి బృందం'. బండి మనోజ్ కుమార్, గరిడేపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సాగుతున్న ఈ సేవా ప్రస్థానం పలువురి జీవితాల్లో వెలుగులు నింపుతోంది. శనివారం ఖమ్మం 60వ డివిజన్ లోని రామన్నపేట, రామన్న పేట కాలని పరిసర ప్రాంతాల్లో పలువురు బాధితులకు వారు ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు.

**మేమున్నామని**

రామన్నపేట కాలనీకి చెందిన బానోతు శ్రీను గత గురువారం అకస్మాత్తుగా మరణించడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. విషయం తెలుసుకున్న బృందం శనివారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించింది. బండి మనోజ్ కుమార్ తన వంతుగా రూ. 5,000 ఆర్థిక సాయాన్ని అందించి ఆ కుటుంబానికి భరోసానిచ్చారు.

**ఆస్పత్రిలో పరామర్శ.. వైద్యానికి తోడ్పాటు**

ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీరభద్రం కుమారుడు నవీన్‌ను మనోజ్ కుమార్, గరిడేపల్లి వెంకటేశ్వర్లు పరామర్శించారు. మెరుగైన వైద్యం పొందేందుకు తక్షణ ఖర్చుల నిమిత్తం రూ. 5,000 నగదును అందజేశారు. అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతున్న రుంజా అశోక్‌ను పరామర్శించి రూ. 5,000 సాయంతో పాటు దుప్పటిని అందించారు.

**వృద్ధులకు వెచ్చని ఆసరా**

చలికి వణుకుతున్న వృద్ధులను చూసి చలించిన మనోజ్ కుమార్ రామన్నపేట లోని వయోవృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. అలాగే అనారోగ్యంతో సతమతమవుతున్న షేక్ హిమామ్ సాబ్ కు నెలకు సరిపడా మందులు గరిడేపల్లి వెంకటేశ్వర్లుతో కలిసి సమకూర్చడంతో పాటు రూ. 2,000 నగదును అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

# డీఏల పెండింగ్‌తో ఉద్యోగుల ఆందోళన.!

◆ ఆరు డీఏల బకాయిల భారంతో సతమతమవుతున్న ఉద్యోగులు, పెన్షనర్లు.




**సత్తుపల్లి, జనవరి 3 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కరువు భత్యం (డీఏ) సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. ఇప్పటికే ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండగా, 2026 జనవరి నాటికి మరో డీఏ వచ్చి చేరనుంది. దీంతో మొత్తం ఆరు డీఏల బకాయిల భారం ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులపై పడుతోంది. డీఏల పెండింగ్ అంశంపై ఉద్యోగ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. నిత్యావసర ధరలు పెరుగుతున్న వేళ, పెరగాల్సిన డీఏలు విడుదల కాకపోవడం కుటుంబ బడ్జెట్‌ను దెబ్బతీస్తోందని ఉద్యోగులు పేర్కొంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలన ముగిసే నాటికి సుమారు మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని ఉద్యోగ సంఘాలు గుర్తు చేస్తున్నాయి. కోవిడ్ ప్రభావం, ఆర్థిక సంక్షోభం కారణంగా అప్పట్లో డీఏల విడుదలకు జాప్యం జరిగిందని అప్పటి ప్రభుత్వం వివరణ ఇచ్చింది.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం జూన్ 2024లో ఒక డీఏను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ప్రస్తుతం మరో మూడు డీఏలు పెండింగ్‌లో ఉండగా, 2026 జనవరిలో వచ్చే డీఏను కలిపితే నాలుగు డీఏలు ఈ ప్రభుత్వ హయాంలోనే పెండింగ్‌గా ఉన్నట్లవుతోంది. అధికారంలోకి వస్తే డీఏలు వెంటనే క్లియర్ చేస్తామని ఇచ్చిన హామీ ఇప్పటివరకు అమలుకాకపోవడంపై ఉద్యోగుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ఉద్యోగుల విషయంలో గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం మధ్య పెద్దగా తేడా లేదన్న అభిప్రాయం కూడా వినిపిస్తోంది. ఒకవైపు కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లింపులు జరుగుతుండగా, మరోవైపు ఉద్యోగుల డీఏలు వాయిదా పడుతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. కేబినెట్ ఆమోదం పొందిన డీఏల జీవోల







# కాప్రా సర్కిల్లో స్వచ్ఛ సర్వేక్షన్ లో భాగంగా నిర్మాణ వ్యర్థాల తొలగింపు

**కాప్రా, జనవరి 03 (తెలంగాణ ముచ్చట్లు):** స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా రోడ్ల పక్కన ఖాళీ స్థలాలు, పార్కుల్లో పేరుకుపోయిన భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించే కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు.ఈ సందర్భంగా పద్మ రావు నగర్, కాప్రా పార్క్‌లో పేరుకుపోయిన నిర్మాణ వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ కమిషనర్ శ్రీహరి పర్యవేక్షించారు. ఆయనతో పాటు డీఈ (సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్) రవి, సానిటరీ సూపర్వైజర్ సుదర్శన్, జవాన్ రామకృష్ణ, ఎస్ఎఫ్ఏ వసంత్, అశ్విన్ ప్రసాద్, సంజీవ్ పాల్గొన్నారు.అలాగే అంజలి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శివరాజ్, కార్యదర్శి శ్రీహరి మరియు అసోసియేషన్ సభ్యులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని సహకారం అందించారు.పార్కులు, ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలని అధికారులు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.



# సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ ప్రభుదాస్



**కాప్రా, జనవరి 03 (తెలంగాణ ముచ్చట్లు) :** ఉప్పల్ నియోజకవర్గం మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ పరిధిలోని కృష్ణానగర్ కాలనీలో రోడ్ నెంబర్-5 వద్ద జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలనీ ప్రజలకు ఉపయోగపడేలా నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటిస్తూ రోడ్డు పనులను వేగవంతంగా పూర్తి చేసి త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డీఈ రూప, ఏఈ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ చారి, శ్రీనివాస్‌తో పాటు కాలనీ అధ్యక్షులు మల్లారెడ్డి, దేవ్‌రాజ్, అంజయ్య గౌడ్, చారి, బాలయ్య గౌడ్, శ్రీనివాస్ యాదవ్, కిష్టారెడ్డి, శ్రీనివాసులు, మాస్ల మణి, గణేష్, దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# డిపో మేనేజర్‌కు కృతజ్ఞతలు తెలిపిన కుషాయిగూడ కాలనీవాసులు







**కుషాయిగూడ, జనవరి 03 (తెలంగాణ ముచ్చట్లు):** కుషాయిగూడ పరిసర ప్రాంతాల్లోని పలు కాలనీలకు బస్ సౌకర్యం కల్పించినందుకు కుషాయిగూడ బస్ డిపో మేనేజర్ వేణుగోపాల్, ఓఎస్ నర్సింహా రెడ్డికి శనివారం కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.శుభోదయ కాలనీ ఫేస్-1, 2, 3, సోనియా గాంధీ నగర్ కాలనీ ఫేస్-1, 2, 3, వాసవి శివనగర్ కాలనీ, మీనాక్షి నగర్, న్యూ వాసవి శివనగర్, ఎంఆర్ఆర్ కాలనీ, ద్వారకాపురి కాలనీ, మధురనగర్, మోడీ కాలనీ, గణేష్ నగర్ కాలనీ, వైష్ణవి ఎన్‌క్లేవ్, మారుతి ఎన్‌క్లేవ్, లక్ష్మీ నర్సింహా కాలనీల వాసులు ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న బస్ సౌకర్యం కల్పించినందుకు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పనగట్ల చక్రపాణి గౌడ్ మాట్లాడుతూ, బస్ సౌకర్యం వల్ల కాలనీవాసుల ప్రయాణ సమస్యలు తీరాయని, ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులకు ఇది ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు.ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ మీనాక్షి నగర్ కాలనీ అధ్యక్షులు సురేష్ గుప్త, నర్సింగ్ రావు, శుభోదయ కాలనీ మాజీ అధ్యక్షులు కాసుల నందం గౌడ్, లక్ష్మీ నర్సింహా కాలనీ ప్రతినిధి ఈశ్వర్ రెడ్డి, గోకుల్ దాస్. ఎస్. సత్యం యాదవ్, నీరుడు బాబు, ఎన్. రమేష్, జగన్ పంతులు, సంజీవ్ యాదవ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్య ద్వారానే మహిళాభ్యున్నతి సాధ్యం





- డా. జిల్లెల చిన్నారెడ్డి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు

**వనపర్తి,జనవరి3(తెలంగాణ ముచ్చట్లు):** మహిళల చేత అక్షరాలు దిద్దించిన భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పేర్కొన్నారు. సమాజంలోని అన్ని రుగ్మతలను తొలగించే శక్తి విద్యకే ఉందని, విద్య ద్వారానే మహిళాభ్యున్నతి సాధ్యమవుతుందని అన్నారు.సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఉత్తమ మహిళా ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.డాక్టర్ చిన్నారెడ్డి మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే 1831 జనవరి 3న మహారాష్ట్రలో జన్మించారని, తొమ్మిదేళ్ల వయసులో మహాత్మ జ్యోతిబా పూలేతో వివాహం జరిగిందని తెలిపారు. ఆమె చురుకుదనం, ఉత్సాహాన్ని గమనించిన జ్యోతిబా పూలే చదవడం, రాయడం నేర్పించడంతో పాటు అహ్మద్‌నగర్‌లోని మిషనరీ సంస్థలో టీచర్ ట్రైనింగ్ పూర్తిచేయించారని వివరించారు.పదిహేడేళ్ల వయసులోనే బాలికలు, వివాహిత మహిళల కోసం పాఠశాల స్థాపించి, అన్ని కులాల వారికి విద్య అందించేందుకు ఆమె చేసిన ప్రయత్నాలు అప్పటి సమాజానికి సవాలుగా నిలిచాయని అన్నారు.పాఠశాలకు వెళ్తూ రాళ్లు విసరడం, బురద చల్లడం, అవమానాలు ఎదురైనా ఆమె వెనకడుగు వేయలేదని, సంచీలో మరో చీర పెట్టుకుని పాఠశాలకు వెళ్లి విద్యను కొనసాగించారని చెప్పారు.ఆరుగురు బాలికలతో ప్రారంభమైన ఈ ఉద్యమం కొద్ది కాలంలో మూడు పాఠశాలలు, 150 మంది విద్యార్థినుల వరకు విస్తరించిందన్నారు.

పుణె ప్రాంతంలో 18 పాఠశాలలు స్థాపించి, 175 ఏళ్ల క్రితమే సమాజానికి ఎదురునిలిచి స్త్రీ విద్యకు పునాదులు వేసిన పూలే దంపతుల కృషివల్లే నేటి మహిళాభ్యుదయం సాధ్యమైందని పేర్కొన్నారు. 1852లో మహిళా సేవా మండల్ స్థాపించి మహిళలకు హక్కులపై అవగాహన కల్పించారని, బాల్యవివాహాలను వ్యతిరేకించి, కులాంతర వివాహాలను ప్రోత్సహించారని తెలిపారు. వితంతువులపై జరుగుతున్న దురాచారాల నిర్మూలనకు పోరాడిన గొప్ప సామాజిక సంస్కర్త అని కొనియాడారు.భర్త జ్యోతిరావు పూలే మరణానంతరం కూడా సావిత్రిబాయి ఒంటరిగానే తన సామాజిక ప్రయాణాన్ని కొనసాగించి, సత్యశోధక్ సమాజాన్ని విజయవంతంగా నడిపించారని, అంటరానితనం నిర్మూలన, దళితుల విద్యకు ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. 'కావ్య పూలే', 'బవన్ కాశి సుబోధ్ రత్నాకర్' వంటి కవితా సంపుటాలు రచించారని వివరించారు.1897లో ప్లేగు బాధితులకు సేవలందిస్తూ తానే వ్యాధి బారినపడి మరణించారని, ఆమె త్యాగాన్ని గుర్తిస్తూ పుణె విశ్వవిద్యాలయానికి సావిత్రిబాయి పూలే విశ్వవిద్యాలయం అనే పేరు పెట్టారని తెలిపారు. దేశంలో బాలికల కోసం తొలి పాఠశాలను స్థాపించిన సేవలకు గుర్తింపుగా ఆమె జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా భారత ప్రభుత్వం జరుపుకుంటోందని చెప్పారు.ఈ సందర్భంగా ఉత్తమ మహిళా ఉపాధ్యాయురాలిగా అవార్డులు అందుకున్న వారు తమ పరిసర ప్రాంతాల్లోని మహిళలను చదువుకునేలా ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. మహిళల్లో ఓపిక, సహనం, ధైర్యం అపారమని, మహిళా శక్తిని సమాజం గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, ప్రజావాణి ద్వారా విద్యా సమస్యలను పరిష్కరిస్తూ ఉద్యోగాలను కల్పిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చీర్ల జనార్ధన్, మైనార్టీ సెల్ అధ్యక్షులు సమద్ మియా, జిల్లా ఏఐపీసీ ఉపాధ్యక్షులు నాగార్జున, జిల్లా రిటైర్డ్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు వేనా చారి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆవుల చంద్రశేఖర్, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# జర్నలిస్టుల సంక్షేమమే మా యూనియన్ ధ్యేయం

- టీజేఏ రాష్ట్ర అధ్యక్షులు కేవీ రమణారావు
- జర్నలిస్టుల సమస్యల పై కలెక్టర్ కు వినతి పత్రం
- జిల్లా సమాచార అధికారితో ప్రత్యేక సమావేశం

**ఖమ్మం బ్యూరో,జనవరి 03(తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేఏ) బలోపేతం మరియు జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జిల్లా కేంద్రంలో కీలక సమావేశం నిర్వహించారు టీజేఏ జిల్లా అధ్యక్షులు జి ఎన్ స్వామి ఆధ్వర్యంలో శనివారం ఖమ్మం నగరంలోని ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా టీజేఏ రాష్ట్ర అధ్యక్షులు కె.వి. రమణారావు హాజరయ్యారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల హక్కుల కోసం పోరాడుతున్న మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మరింత పటిష్టం చేయాలని అన్నారు క్షేత్రస్థాయిలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, హెల్త్ కార్డ్స్, మరియు ఇళ్ల స్థలాల సాధన కోసం భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు జర్నలిస్టులందరూ ఐకమత్యంతో ఉంటేనే సమస్యల పరిష్కారం సాధ్యమని అన్నారు. జర్నలిస్టు సమస్యలపై పోరాటానికి మా యూనియన్ ఎప్పుడు అండగా ఉంటుందని అన్నారు జర్నలిస్టుల సంక్షేమం కోసం టీజేఏ నిరంతరం కృషి చేస్తోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అందేలా చూడటమే మా లక్ష్యం అని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షులు జి. ఎన్ స్వామి మాట్లాడుతూ జిల్లాలో యూనియన్ విస్తరణకు మాతో కలిసివచ్చే జర్నలిస్టులతో జిల్లా నియోజకవర్గ స్థాయి మరియు ప్రెస్ క్లబ్ కమిటీలు త్వరలో ప్రకటిస్తామని తెలిపారు ఈ సమావేశంలో జిల్లా ముఖ్య జర్నలిస్టులు పాల్గొన్నారు

జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం

జేఏ రాష్ట్ర అధ్యక్షులు కెవి రమణ రావు ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి, జర్నలిస్టుల సమస్యలపై వినతి పత్రం ఇవ్వడం జరిగింది అనంతరం డి పి ఆర్ ఓ కార్యాలయం వెళ్లి డిపిఆర్ఓ ను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి జర్నలిస్టుల సమస్యలపై ప్రత్యేకంగా చర్చించడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తోమటి గంగాధర్, మత్తి రామకృష్ణ, షేక్ యాకుబ్ పాషా, భూక్య ఉపేందర్, సంపత్ , మాధవరావు ఇతరులు పాల్గొన్నారు

## పెద్దమందడిలో ఘనంగా సావిత్రిబాయి పూలే 195వ జయంతి వేడుకలు



**పెద్దమందడి,జనవరి3(తెలంగాణ ముచ్చట్లు):**అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్‌లో కార్యక్రమం

పెద్దమందడి మండల కేంద్రంలోని కమ్యూనిటీ హాల్‌లో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సావిత్రిబాయి పూలే 195వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ... నిమ్న వర్గాల అభ్యున్నతి కోసం అలుపెరగని పోరాటం చేసి, మహిళా విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన సామాజిక కార్యకర్త సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. చదువుల తల్లిగా పేరొందిన ఆమె, అడుగడుగునా అవమానాలు ఎదురైనా అక్షరాల వైపే అడుగులు వేసి, ఆడవారి జీవితాల నుంచి అంధకారాన్ని తొలగించేందుకు అక్షర పోరాటం చేసి దేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా నిలిచారని గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సూర్య గంగమ్మ రవి, ఉప సర్పంచ్ ఉషన్న, పంచాయతీ కార్యదర్శి దిలీప్ రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటస్వామి, మాజీ జెడ్పీటీసీ వెంకటస్వామి, 14 వార్డు సభ్యులు, అంబేద్కర్ యూత్ యువకులు, గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఎస్సీ కాలనీ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## వనపర్తి బీఎస్సీ వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాల తరలింపుకు కుట్ర



- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్వీ నాయకుల తీవ్ర విమర్శలు

**వనపర్తి,జనవరి3(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తిలో ఏర్పాటు చేసిన బీఎస్సీ వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాలను తరలించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పక్కా ప్రణాళికతో వ్యవహరిస్తోందని వనపర్తి బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు హేమంత్ ముదిరాజ్, పట్టణ యువజన అధ్యక్షులు సూర్యావంశం గిరి తీవ్ర ఆరోపణలు చేశారు.వారు మాట్లాడుతూ, వనపర్తిలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినీలను కావాలనే ఇతర ప్రాంతాల్లోని కళాశాలలకు మళ్లిస్తూ అప్లికేషన్లు పంపించారని తెలిపారు. జీవో సవరణలు, గుర్తింపు పేర్లతో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినీలను వేరే ప్రాంతాలకు తరలించే పన్నాగం పన్నారని విమర్శించారు.2022 సంవత్సరంలో అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి చొరవతో దేశంలోనే తొలిసారిగా తెలంగాణ రాష్ట్రంలో రెండు బీఎస్సీ వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేశారని, అందులో ఒకదాన్ని వనపర్తి జిల్లాకు తీసుకువచ్చారని గుర్తు చేశారు. వ్యవసాయ కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థినీలకు ఇది ఎంతో ఉపయోగకరమై, భవిష్యత్తులో విద్యా ప్రమాణాలు, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని ఆశలు కలిగించిందన్నారు. అలాంటి కళాశాలను ప్రస్తుత ప్రభుత్వం దుర్మార్గపు చర్యలతో నిర్వీర్యం చేయాలని చూస్తోందని ఆరోపించారు.పాత జీవోల ప్రకారం నాగవరం సమీపంలో 30 ఎకరాల భూమి, కేంద్ర సామాజిక బాధ్యత నిధుల నుంచి కోటి యాభై లక్షల రూపాయలు, వెనుకబడిన తరగతుల సంక్షేమ నిధుల నుంచి మూడు కోట్ల రూపాయలు కళాశాల మౌలిక వసతుల కోసం కేటాయించారని తెలిపారు. ఈ నిధులను వినియోగించకుండా రెండు సంవత్సరాలుగా విద్యార్థులు, బోధన సిబ్బందిని ఇబ్బందులకు గురిచేస్తూ కళాశాల తరలింపుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.ఈ విషయంలో స్థానిక శాసనసభ్యులు, మంత్రులు కనీస చిత్తశుద్ధి చూపడం లేదని అన్నారు. వనపర్తి నుంచి బీఎస్సీ వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాలను తరలించే ప్రయత్నాలు కొనసాగితే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున నిరసనలు, ధర్నాలు చేపడతామని బీఆర్ఎస్వీ నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి అవిశెట్టి భాగ్యరాజ్, మాజీ ఉప మండల పరిషత్ అధ్యక్షులు చంద్రశేఖర్, వనపర్తి బీఆర్ఎస్ సామాజిక మాధ్యమాల అధ్యక్షులు మాధవరావుపల్లె సునీల్ వాల్మీకి, మహిళా నాయకులు కవిత నాయక్, మధులత, బీఆర్ఎస్ నాయకులు మంద రాము, ఎండీ అలీం, సిరివట్ల శంకర్, ఎం.కరుణాకర్, నరసింహ, ఉమ్మల వంశీ, శివ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, వసంత్ గౌడ్, పి.రాకేష్, వెంకటేష్, రవి తదితరులు పాల్గొన్నారు.




## ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తాకు శుభాకాంక్షలు తెలిపిన ఎస్.వి. కృష్ణ

**మల్లాపూర్ , జనవరి 03 (తెలంగాణ ముచ్చట్లు):** జీహెచ్ఎంసీ ఉప్పల్ జోనల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రాధిక గుప్తాను మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు .ఈ సందర్భంగా మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్.వి. కృష్ణ (కిట్టు) ఆధ్వర్యంలో నాయకులు ఆమెను కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫిరోజ్ ఖాన్, అక్బర్, పాషా, అన్వర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.ఉప్పల్ జోన్ అభివృద్ధి దిశగా సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా నాయకులు కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
ఆదివారం-04- జనవరి 2026


# చిన్న నగరాలవైపు ఉద్యోగ అవకాశాలు

దేశీయ ఐటీ రంగ నియామకాల్లో చిన్న నగరాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. ఇప్పటికే పెద్ద నగరాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న అంతర్జాతీయ సంస్థలు, దేశీయ దిగ్గజాలు.. ఇప్పుడు చిన్న నగరాలకు విస్తరిస్తున్నాయి. జనవరిలో నియామకాల కోసం ఐటీ రంగ కంపెనీల నుంచి వస్తున్న ప్రకటనలు ఈ విషయాన్ని ధ్రువీకరిస్తున్నాయి. గతేడాది జనవరి కంటే, ఈ నెలలో ఐటీ ఉద్యోగ నియామక ప్రకటనల్లో 24% తగ్గుదల నమోదైంది. 2021 జనవరి తర్వాత టెక్ నియామకాలు ఈ స్థాయిలో పడిపోవడం ఇది రెండోసారి. ఉద్యోగ నియామకాల సంస్థ ఎక్స్‌ఫెనో విడుదల చేసిన 'యాక్టివ్ టెక్ జాబ్స్ ఔట్‌లుక్‌ఇండియా' తాజా నివేదిక 'ఐటీ రంగంలో నియామక ప్రక్రియ ఇంకా మందగమనంలోనే ఉందని' పేర్కొంది. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 1.03 లక్షల ఐటీ ఉద్యోగాలే భర్తీకి అందుబాటులో ఉన్నాయని వెల్లడించింది.

2022లో ఐటీ నియామకాలు గరిష్ఠ స్థాయిలో ఉన్నప్పుడు, జనవరిలోనే దాదాపు 2.60 లక్షల ఉద్యోగాలు అందుబాటులో ఉండేవి. అప్పటితో పోలిస్తే, ప్రస్తుతం నియామకాల ప్రకటనలు 60% క్షీణించాయి. 2025 డిసెంబరుతో పోల్చి చూసినా జనవరిలో ఉద్యోగాల సంఖ్య 1% తగ్గిందని నివేదిక పేర్కొంది. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి, ఐటీ వ్యయాల్లో కోత వంటివే నియామకాల తగ్గుదలకు కారణమని నివేదిక పేర్కొంది.


మొత్తం ఖాళీల్లో 79,000 వరకు పూర్తిస్థాయి ఉద్యోగాలున్నాయి. వీటి సంఖ్య నెలవారీగా 5%, వార్షిక ప్రాతిపదికన 24% తగ్గింది. ప్రారంభ స్థాయి తాజా నియామకాలు కొంత ఊరట కలిగిస్తున్నాయి. జనవరిలో 14,000 ఉద్యోగాలు నమోదైనా, గత ఏడాది ఇదే కాలంలో పోలిస్తే ఇవీ 18% తక్కువగా ఉన్నాయి. ఐటీ సేవల కంపెనీల్లో నియామకాలు 18% తగ్గి, 41,000 ఖాళీలకు పరిమితమయ్యాయి.

ఈ పరిస్థితుల్లోనూ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) నుంచి ఉద్యోగ నియామకాల్లో సానుకూలత కనిపిస్తోంది. నెలవారీగా 13%, వార్షికంగా 7% వృద్ధితో 17,000 ఉద్యోగాలను భర్తీ చేసే ఆలోచనతో ఇవి ఉన్నాయి. ఇంజినీరింగ్, కోర్, టెక్ విభాగాలు నియామకాల్లో ఆధిపత్యం కొనసాగిస్తున్నా.. డిమాండ్ ఏడాది కాలంలో 37 శాతానికి పడిపోయింది. కన్సల్టింగ్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ వంటి అనుబంధ విభాగాల్లోనూ ఉద్యోగాలు తగ్గాయి.

ప్రధాన ఐటీ హబ్‌లైన హైదరాబాద్, బెంగళూరు, దిలీఎన్‌సీఆర్ వంటి నగరాల్లో నియామకాలు 49% తక్కువగా ఉన్నాయని నివేదిక తెలిపింది. అయితే రెండో, మూడో శ్రేణి నగరాల్లో నియామక ప్రకటనలు 30% పెరగడం గమనార్హం. ఐటీ ఉద్యోగాలు, మెట్రో నగరాల నుంచి చిన్న పట్టణాలకు విస్తరిస్తున్నాయనే దానికి ఇది సంకేతమని నివేదిక పేర్కొంది.

పని విధానంలోనూ భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఉద్యోగాల్లో 70 శాతానికి పైగా ఆఫీసు నుంచే పని చేయాలనే నిబంధన విధిస్తున్నాయి. ఐటీ నియామకాల మందగమనానికి అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితులూ కారణమని, ఎక్స్‌ఫెనో సహ వ్యవస్థాపకుడు కమల్ కారంత్ విశ్లేషించారు. గతంలో ఉన్న నియామక వేగాన్ని మళ్లీ అందుకోవడం ఇప్పట్లో కష్టంగానే కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు.





# యూరియా స్టాక్ పట్ల రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దు...

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**ఖమ్మం బ్యూరో, జనవరి 03 (తెలంగాణ ముచ్చట్లు)**

ఖమ్మం జిల్లాలో 13 వేల 795 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ అందుబాటులో ఉందని, రైతులు ఏలాంటి అపోహలు నమ్మవద్దని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.

శనివారం జిల్లా కలెక్టర్ , చింతకాని మండలం నాగులవంచ గ్రామంలోని వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం వద్ద యూరియా కేంద్రంలో కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతులతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. జిల్లాలో యూరియా సమృద్ధిగా ఉందని, రైతులు అందరికీ పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం మొత్తం 13 వేల 795 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని తెలిపారు. మార్క్ ఫెడ్ వద్ద 9,736 మెట్రిక్ టన్నులు, ప్యాక్స్ వద్ద 900 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్స్ వద్ద 663 మెట్రిక్ టన్నులు, గతంలో మన దగ్గర ఉన్న సి ఆర్ పి స్టాక్ 2495 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్ అన్నారు. ప్రతి 2వేల ఎకరాల సాగు విస్తీర్ణానికి ఒక యూరియా సేల్ పాయింట్ ఉండే విధంగా చర్యలు చేపట్టామని, యూరియా కోసం రైతులు ఏ సమయంలో రావాలో వారికి ముందస్తుగానే సమాచారం అందిస్తూ కూపన్లు కూడా జారీ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరమైన మేర యూరియా అందుబాటులో ఉందని, రైతులు అధికారులకు సహకరిస్తూ వారు సూచించిన సమయంలో వచ్చి యూరియా తీసుకుని వెళ్లాలని కలెక్టర్ తెలిపారు. ఒక రైతు అతని సాగు విస్తీర్ణానికి అవసరమైనయూరియా తప్పకుండా ఇస్తామని దానికంటే అధికంగా యూరియా తీసుకుని వెళ్లకుండా చూడాలని కలెక్టర్ తెలిపారు. రైతులు ఎవరు ప్రస్తుత అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయవద్దని కలెక్టర్ రైతులకు సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ధనసరి. పుల్లయ్య, జిల్లా సహకార శాఖ అధికారి గంగాధర్, మధిర వ్యవసాయ సహాయ సంచాలకులు విజయ్ చంద్ర, చింతకాని తహసీల్దారు బాజ్జీ ప్రసాద్, నాగులవంచ పిఎసిఎస్ సీఈవో యాలముడి శ్రీనివాసరావు, ఏ ఈ ఓ దారగాని కల్యాణి సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నూతన గ్రామ పాలక వర్గానికి అంబేద్కర్ యూత్ ఘన సన్మానం

**పెద్దమందడి,జనవరి3(తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి మండల కేంద్రంలో నూతనంగా ఎన్నికైన గ్రామ పంచాయితీ పాలక వర్గానికి అంబేద్కర్ యూత్ సభ్యులు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్‌తో పాటు 14 మంది వార్డు సభ్యులకు శాలువాలు కప్పి గౌరవించారు.

ఈ సందర్భంగా నూతన పాలక వర్గ సభ్యులు మాట్లాడుతూ--- గ్రామ ప్రజలు తమపై ఉంచిన విశ్వాసం ఎంతో గొప్పదని పేర్కొన్నారు.ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పారదర్శకంగా పాలన సాగిస్తామని, గ్రామ ప్రజల అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు.అలాగే గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ ఒక కుటుంబంలా కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామ సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధే లక్ష్యంగా పాలక వర్గం పనిచేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గంగమ్మ రవి, ఉప సర్పంచ్ ఉషన్న, 14 మంది వార్డు సభ్యులు, అంబేద్కర్ యూత్ సభ్యులు, యువకులు పాల్గొన్నారు. అలాగే మాజీ జడ్పీటీసీ కొమ్ము వెంకటస్వామి, మాజీ సర్పంచ్ కుడుకుంట్ల వెంకటస్వామి, గోవర్ధన్ సార్, ఉపాధ్యాయులు, సేనాపతి, నరేష్ వాకిటి, రామాంజనేయులు, రాఘవేంద్ర, గొల్ల పుల్లన్న, ఖాదర్ పాషా, జంగం కృష్ణతో పాటు గ్రామ ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎంజీఎన్ఆర్ఈజీఏ చట్టం దానధర్మం కాదు




మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (ఎంజీఎన్ఆర్ఈజీఏ) చట్టం దానధర్మ పథకం కాదు, రాజ్యాంగ పరమైన చట్టబద్ధ హామీ అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. ఈ చట్టం ద్వారా కోట్లాది పేదలకు స్వగ్రామాల్లోనే ఉపాధి లభించిందని, ఆకలి, బల వంతపు వలసలు తగ్గాయని, గ్రామీణ కూలీల వేతనాలు పెరిగాయని తెలిపారు.

మహిళల ఆర్థిక గౌరవాన్ని ఈ పథకం బలోపేతం చేసిందన్నారు. అలాంటి ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ప్రతిపాదిత జీ రామ్ జీ చట్టం ద్వారా కోట్లాది గ్రామీణ కార్మికుల హక్కులను హరించి వేసే కుట్ర జరుగుతోందని విమర్శించారు. ఇందుకు నిరసనగా దేశవ్యాప్తంగా 'ఉపాధి హామీ చట్టం బచావో సంగ్రామ్'ను కాంగ్రెస్ ప్రారంభించినట్లు ప్రకటించారు. ఈ మేరకు శనివారం 'ఎక్స్' లో పోస్ట్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన కేంద్రం ముందు మూడు డిమాండ్లను ఉంచారు. జీ రామ్‌జీ చట్టాన్ని వెంటనే ఉపసంహరించాలని, ఉపాధి చట్టాన్ని హక్కుల ఆధారిత చట్టంగా తిరిగి అమలు చేయాలని, పని హక్కు, పంచాయతీల అధికారాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కొత్త చట్టం చట్టం ద్వారా పని హక్కును రద్దు చేసే ప్రయత్నం జరుగుతోందని అన్నరు. ఇకపై ఉపాధి హామీ ఉండదని, ఎంపిక చేసిన పంచాయతీల్లో మాత్రమే అనుమతి ఆధారంగా పని కల్పిస్తారని పేర్కొన్నారు.

బడ్జెట్‌కు పరిమితి విధించడం వల్ల సంక్షోభ సమయంలోనూ పనులు నిలిచిపోయే ప్రమాదముందని తెలిపారు. నిధులు, పనులపై నిర్ణయాలు ఢిల్లీ నుంచే తీసుకోవడం ద్వారా గ్రామ సభలు, పంచాయతీలను నిస్సత్తువగా మార్చే యత్నమని ఆయన విమర్శించారు. 60 రోజుల పని బ్లాక్‌అవుట్ నిబంధన అత్యవసర సమయంలో ఉపాధి నిరాకరణకు చట్టబద్ధత ఇస్తుందన్నారు.

వేతనాలు అనిశ్చితంగా మారడం, 40 శాతం నిధుల భారం మోపడం వల్ల పేద రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని హెచ్చరించారు. బయోమెట్రిక్, యాప్ ఆధారిత టెక్నాలజీ వల్ల నిజమైన కూలీలు ఉపాధి నుంచి వెలివేతకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ ఆస్తుల సృష్టి స్థానంలో కాంట్రాక్టర్ తరహా పనులు పెరుగుతాయని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పంచాయతీ స్థాయి నుంచి పార్లమెంట్ వరకూ శాంతియుతంగా, దృఢంగా పోరాటం చేస్తామని ఆయన ప్రకటించారు.

# బస్ డ్రైవర్ నుంచి అధ్యక్షుడి వరకు.. 'మదురో ప్రస్థానం' ముగిసినట్లేనా?




తమ దేశంలో మాదక ద్రవ్యాల సరఫరా, హింసను ప్రేరేపించేందుకు నికొలస్ మదురో నేతృత్వంలోని వెనెజువెలా ప్రభుత్వమే కారణమని ఆరోపిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ .. ఆ దేశంపై భీకర దాడులు చేపట్టారు. అధ్యక్షుడు మదురోతోపాటు ఆయన సతీమణి సీలీయా ఫ్లోరెస్‌ని తమ కస్టడీలోకి తీసుకున్నట్లు ప్రకటించారు. దీంతో మదురో ప్రభుత్వాన్ని కూల్చాలన్న తన సంకల్పాన్ని ట్రంప్ దాదాపుగా నెరవేర్చుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బస్సు డ్రైవర్ నుంచి దేశాధ్యక్షుడి వరకు ఎదిగి.. దశాబ్దానికిపైగా వెనుజువెలాను పాలించిన మదురో ప్రస్థానం ఇక ముగిసినట్లేనని కనిపిస్తోంది.

కారకస్‌లో 1962లో జన్మించిన మదురో.. బస్సు డ్రైవర్‌గా తన ఉద్యోగ జీవితాన్ని మొదలుపెట్టారు. ఆ తర్వాత యూనియన్ నేతగా ఎదిగారు. హ్యూగో చావెజ్ నేతృత్వంలోని యునైటెడ్ సోషలిస్ట్ పార్టీ ఆఫ్ వెనెజువెలా (PSUV) చేరిన మదురో కీలక బాధ్యతలు చేపట్టారు. చావెజ్ ప్రభుత్వంలో 2006 నుంచి 2013 వరకు విదేశాంగ మంత్రిగా పనిచేశారు. లాటిన్ అమెరికా కరేబియన్ (ఏఎల్‌బీఏ) కూటమి ఏర్పాటులో కీలక పాత్ర వహించారు. 2012లో ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఆయన.. 2013లో చావెజ్ మరణంతో తాత్కాలిక అధ్యక్షుడిగా నియమితులయ్యారు.

అనంతరం జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో గెలుపొందిన ఆయన.. ఇప్పటివరకు అధ్యక్ష పదవిలో కొనసాగుతున్నారు. అయితే, ఆయా ఎన్నికల్లో అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఆయన సతీమణి సీలీయా ఫ్లోరెస్ న్యాయవాది. అటార్నీ జనరల్‌గా పనిచేసిన ఆమె.. మొదటి భర్తతో విడాకుల తర్వాత మదురోను వివాహం చేసుకున్నారు.

తమ దేశానికి వెనుజువెలా వలసలను ప్రోత్సహిస్తోందని, నార్కో టెర్రరిజానికి పాల్పుతోందనేది ట్రంప్ ప్రధాన ఆరోపణ. ఆ దేశంలోని జైళ్లు, పిచ్చాసుపత్రులను ఖాళీ చేయించి మరీ వారిని బలవంతంగా అమెరికాకు వెళ్లేలా మదురో ప్రోత్సహిస్తున్నారనేది ట్రంప్ ఆరోపించగా.. మదురో ప్రభుత్వం ఖండించింది. దీనికితోడు అమెరికాకు పెద్దఎత్తున మాదక ద్రవ్యాల రవాణాకు కూడా వెనుజువెలానే కారణమని ట్రంప్ చేస్తున్న మరో ఆరోపణ. వెనుజువెలాకు చెందిన రెండు డ్రగ్ ముఠాలకు మదురోనే నాయకుడని ట్రంప్ పలుమార్లు విమర్శించారు.

ప్రపంచంలోనే అత్యధికంగా చమురు నిల్వలు కలిగిన దేశాల్లో వెనెజువెలా ఒకటి. 2014 తరవాత వీటి ధరలు పతనం కావడానికి తోడు అమెరికా, ఐరోపా దేశాల ఆంక్షలవల్ల తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దేశంలో ఆకలికేకలు మిన్నంటాయి. ఈ క్రమంలో ఇక్కడి చమురుపై ఆధిపత్యం చెలాయించాలనుకుంటున్న ట్రంప్ సర్కార్.. ఇందుకోసం కొంతకాలంగా ప్రయత్నాలు చేస్తోంది. అందుకే అమెరికాకు డ్రగ్స్ సరఫరాలో మదురో ఉన్నాడని ఆరోపిస్తూ.. ప్రభుత్వం నుంచి దిగిపోవాలని హెచ్చరిస్తూ వచ్చింది. ఈ క్రమంలోనే దేశాధ్యక్షుడిని అరెస్టు చేసేందుకు సహకరిస్తే 50 మిలియన్ డాలర్ల (ప్రస్తుతం రూ.450 కోట్లు) రివార్డు అందిస్తామని కొంతకాలం క్రితం ఆఫర్ చేసింది. అంతేకాదు వెనుజువెలా ప్రతిపక్ష నేత కొరినా మచాడోకు, ట్రంప్‌నకు మధ్య రాజకీయంగా సన్నిహిత సంబంధాలు కూడా ఉన్నాయి. ట్రంప్ చర్యలకు ఆమె బహిరంగంగానే మద్దతు ఇచ్చారు. ఇటీవల నోబెల్ శాంతి బహుమతి ఆమెకు వచ్చిన సమయంలో వారిద్దరూ ఫోన్‌లో సంభాషించుకున్నారు. ఈ క్రమంలోనే నేరుగా రంగంలోకి దిగిన ట్రంప్ సైన్యం.. ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి మదురోను కస్టడీలోకి తీసుకోవడం గమనార్హం.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# యూట్యూబర్ అన్వేష్ చుట్టూ బిగుస్తున్న ఉచ్చు!

**హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):**



నమస్తే ఫ్రెండ్స్. నాపేరు అన్వేష్. నేను ప్రపంచ యాత్రికుడిని. వెల్కమ్ టు మై ఛానల్ నా అన్వేషణ. నా కళ్లతో మీకు చూపిస్తాను ప్రపంచాన్ని' అంటూ ప్రపంచ దేశాల్లో వింతలు, విశేషాల గురించి వివరించే యూట్యూబర్ అన్వేష్ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఇప్పటికే వరుస వివాదాలు, క్షమాపణలు, సబ్స్క్రైబర్ల సంఖ్య భారీ పడిపోయింది.

ఈ క్రమంలో గరికపాటిపై యుద్ధం అంటూ మరో వివాదంలో చిక్కుకున్న అన్వేష్‌పై తెలంగాణ మహిళా కమిషన్‌కు పలు ఫిర్యాదులు అందినట్లు తెలుస్తోంది. ఆ ఫిర్యాదుల్లో మహిళలపై అవమానకరంగా, అసభ్యంగా వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మహిళలను వస్తువుల్లా చూపిస్తూ కంటెంట్‌ను ప్రసారం చేశాడని బాధితులు కమిషన్ దృష్టికి తీసుకువచ్చినట్లు సమాచారం.

మహిళల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా వీడియోలు రూపొందించడమే కాకుండా, బాలల హక్కులకు భంగం కలిగించే కంటెంట్ కూడా ఆ ఛానల్‌లో ఉందని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. ఆ ఫిర్యాదులపై.. సమాజంలో నైతిక విలువలు, సామాజిక సమతుల్యతకు భంగం కలిగించేలా ఈ వీడియోలు ఉన్నాయని కమిషన్ అభిప్రాయపడింది.

సంబంధిత వీడియోల లింకులు, ఖాతా వివరాలను సేకరించింది. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్లు కూడా కమిషన్ గుర్తించింది. ఈ అంశాలు ప్రజా నైతికతకు విరుద్ధమని, చట్టపరమైన చర్యలు అవసరమని స్పష్టం చేసింది. విచారణలో సంబంధిత ఇన్‌ఫ్లుయెన్సర్ విదేశాల్లో ఉన్నట్లు గుర్తించింది. అందుకే ఈ కేసును జాతీయ మహిళా కమిషన్‌కు పంపినట్లు తెలంగాణ మహిళా కమిషన్ వెల్లడించింది.

మహిళల గౌరవాన్ని కాపాడటంలో, బాలల హక్కులను రక్షించడంలో ఇలాంటి చర్యలు అత్యవసరమని కమిషన్ పేర్కొంది. ఎన్‌సీడబ్ల్యూ ఈ కేసుపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ మహిళా కమిషన్ విజ్ఞప్తి చేసింది.

# కాంగ్రెస్ మా సహజ మిత్రుడు.. విజయ్ టీవీకే సంకేతాలు

(మొదటి పేజీ తరువాయి)

రాహుల్ గాంధీ, తమ నేత విజయ్ మంచి స్నేహితులని తెలిపారు.

ఇరు పార్టీల మధ్య పొత్తుకు అవకాశాలున్నప్పటికీ ఒక అవగాహనకు వచ్చే ముందు కొన్ని అంశాలపై చర్చించాల్సిన అవసరం ఉందని ఫెలిక్స్ అన్నారు. ప్రస్తుత ప్రతిష్టంభనకు తమిళనాడు కాంగ్రెస్ కారణమని ఆరోపించారు. ఆ పార్టీ విభాగం నేతలు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం టీవీకేతో చర్చలకు వెనుకంజ వేస్తున్నట్టు కనిపిస్తోందని అన్నారు. టీవీకే, కాంగ్రెస్ పొత్తు పెట్టుకుంటే మైనారిటీ, బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలిపోకుండా కాపోడుకోవచ్చని అభిప్రాయపడ్డారు.

కాగా, టీవీకేకాంగ్రెస్ పొత్తు పెట్టుకోవచ్చనే సంకేతాలు గత నెలలోనే కనిపించినట్టు చెబుతున్నారు. డిసెంబర్ 25న జరిగిన టీవీకే కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొనడం ఈ వాదనకు బలం చేకూర్చింది. తమిళనాడులో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా 2024 అక్టోబర్‌లో టీవీకేను విజయ్ ప్రారంభించారు. అయితే టీవీకే ఎంట్రీతో తమకొచ్చే ముప్పు ఏదీ లేదని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సారథ్యంలోని డీఎంకే ధీమా వ్యక్తం చేస్తోంది.



# గిగ్ మోడల్‌ను వెనకేసుకొచ్చిన దీపిందర్ గోయల్

జొమాటోలో 2025లో డెలివరీ పార్ట్‌నర్ సగటు వేతనం రూ.102గా ఉందని దీపిందర్ పేర్కొన్నారు. 2024లో ఈ మొత్తం రూ.92 ఉండగా.. ఏడాదిలో 10.9 శాతం వృద్ధి నమోదైందని తెలిపారు. డెలివరీ పార్ట్‌నర్లలో చాలామంది నెలలో కొన్ని రోజులు, కొన్ని గంటలు మాత్రమే పనిచేస్తారని చెప్పారు. ఒకవేళ రోజుకు 10 గంటలు చొప్పున నెలలో 26 రోజులు పనిచేసినా ఒక్కో డెలివరీ ఏజెంట్ రూ.26,500 ఆర్జించొచ్చని, అందులోంచి పెట్రోల్, నిర్వహణ ఖర్చులు మినహాయించినా రూ.21వేలు వస్తుందని పేర్కొన్నారు. దీనికి టిప్ అదనం అని చెప్పారు.

ఫుల్ టైమ్ వర్క్‌కు ప్రత్యామ్నాయంగా గిగ్ వర్క్ మోడల్ రూపుదిద్దుకుందని దీపిందర్ పేర్కొన్నారు. అధిక పని గంటల ప్రసక్తే ఉండబోదని చెప్పారు. 2025లో డెలివరీ పార్ట్‌నర్లు సగటున 38 రోజులు, రోజుకు, ఏడేసి గంటలు మాత్రమే పనిచేశారని పేర్కొన్నారు. మొత్తం డెలివరీ పార్ట్‌నర్లలో 2.3 శాతం మంది మాత్రమే ఏడాదిలో 250 కంటే ఎక్కువ రోజులు పని చేశారని చెప్పారు. అలాంటప్పుడు పూర్తిస్థాయి ఉద్యోగితో సమానంగా ప్రయోజనాలు, స్థిరమైన వేతనాలు కోరడం ఈ మోడల్‌కు ఏమాత్రం సరిపోదని పేర్కొన్నారు. ఫలానా చోటే పనిచేయాలని గానీ, ఫలానా షిఫ్ట్‌లోనే చేయాలన్న డిమాండ్ కూడా లేదని గుర్తు చేశారు.




10 నిమిషాల డెలివరీ హామీ వల్ల డెలివరీ ఏజెంట్లు ప్రమాదాల బారిన పడతారన్న వాదనలనూ కొట్టి పారేశారు. ఆర్డర్ చేసిన ప్రదేశం నుంచి బ్లింకిట్ 2 కిలోమీటర్లు దూరం మాత్రమే ఉంటోందని దీపిందర్ పేర్కొన్నారు. దీంతో 8 నిమిషాల్లో డెలివరీ సాధ్యమవుతోందని, ఈ లెక్కన డెలివరీ ఏజెంట్లు ప్రయాణించేది గంటకు సగటున 16 కిలోమీటర్ల వేగంతోనే అని వివరించారు.

2025లో డెలివరీ భాగస్వాముల బీమా కోసం జొమాటో, బ్లింకిట్ సంయుక్తంగా రూ.100 కోట్లు పైనే ఖర్చు చేశాయని దీపిందర్ తెలిపారు. ఒక్కో డెలివరీ పార్ట్‌నర్‌కు రూ.10 లక్షల ప్రమాద బీమా కవరేజీ కల్పిస్తున్నట్లు చెప్పారు.

మహిళా డెలివరీ ఏజెంట్లకు నెలకు వేతనంతో కూడిన రెండు విశ్రాంత సెలవులు ఇస్తున్నామని దీపిందర్ తెలిపారు. ట్యాక్స్ ఫైలింగ్‌లో సహకారం, ఎన్‌పీఎస్ సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. 95 వేల మంది ట్యాక్స్ ఫైలింగ్ సదుపాయాన్ని వినియోగించగా.. 54 వేల మంది పెన్షన్ స్కీమ్‌కు నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. ఇన్ని కల్పిస్తున్నా గిగ్ వర్కర్ల పని పరిస్థితుల గురించి ఆందోళన వ్యక్తంచేయడం సమంజసమా? అని దీపిందర్ ప్రశ్నించారు.



# అర్హులైన వారు అంగన్వాడి సేవలు ప్రతి ఒక్కటి వినియోగించుకోవాలి

**–సర్పంచ్ దూసరి నేతాజీ**

**ఖమ్మం బ్యూరో, జనవరి 03 (తెలంగాణ ముచ్చట్లు)**

శనివారం నేరడ అంగన్వాడి కేంద్రంలో( 1&2 ) ఏ ఎల్ ఎం ఎస్ సి సమావేశం జరిగినది ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ దూసరి నేతాజీ ఉప సర్పంచ్ కోట ముత్తయ్య (బాలేష్) హాజరైనారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సర్పంచ్ మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు ఆరోగ్యలక్ష్మి ద్వారా అందిస్తున్న అంగన్వాడి సేవలు అన్నింటిని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని సూచించారు. గర్భిణీలు బాలింతలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు

36 సంవత్సరాల పిల్లల యూనిఫామ్ పంపిణీ సర్పంచ చేతుల మీదుగా అందించడం జరిగినది 36సంవత్సరాల పిల్లలఅందరిని అంగన్వాడి కేంద్రాలకు క్రమం తప్పకుండా తల్లిదండ్రులు పంపించాలని తెలియజేయడం జరిగినది అంగన్వాడి కేంద్రాలకు మరమ్మతులు చేయిస్తానని తెలియజేసినారు

ఈ కార్యక్రమానికి వార్డ్ మెంబర్స్, గ్రామ పెద్దలు మంకేన నాగేశ్వరావు , గు నుగుంట్ల వెంకన్న , డాక్టర్ సోయల్ ఏఎన్ఎం పద్మా, పిఎస్ పాఠశాల హెచ్ఎం రాధాకృష్ణ , శ్రీనివాసరావు , ఆశా కార్యకర్తలు మరియమ్మ ,కృష్ణమ్మ అంగన్వాడీ టీచర్స్ . కె వెంకమ్మ, పి.సరోజినీ ,అంగన్వాడి హెల్పర్స్ పాప కర్ణ, భద్రమ్మ పాల్గొన్నారు గర్భిణీలు, బాలింతలు, పిల్లలు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సావిత్రి భాయి పూలే జయంతి స్ఫూర్తితో సమానత్వ సమాజ స్థాపనకు పోరాడుదాం

**జార్జిరెడ్డి పి.డి.ఎస్.యూ.**

**ఖమ్మం బ్యూరో, జనవరి 03 (తెలంగాణ ముచ్చట్లు)**



భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి భాయి పూలే జయంతి సందర్భంగా జార్జిరెడ్డి పి.డి.ఎస్.యూ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కేంద్రంలో రెండు కేంద్రాల్లో ఎస్&బిజినార్ మరియు మహిళా డిగ్రీ కళాశాలలో సావిత్రి భాయ్ పూలే గారికి ఘనంగా నివాళ్ళు అర్పించడం జరిగింది.ఈ సందర్భంగా జరిగిన నివాళి సభలో ఎస్ ఆర్ అండ్ బిజినార్ కాలేజ్ లో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్ కుమార్,జార్జిరెడ్డి పి.డి.ఎస్.యూ ఖమ్మం జిల్లా అధ్యక్షులు సురేష్ ( ఎమ్మెస్),ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బానోత్ రెడ్డి, జార్జిరెడ్డి పి.డి. ఎస్.యూ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి రాము, జార్జిరెడ్డి పి డి ఎస్ యు ఖమ్మం జిల్లా గర్ల్స్ కన్వీనర్ పైండ్ల శ్యామల కో కన్వీనర్ మహంకాళి రాణి లు

మాట్లాడుతూ భారతావని చరిత్రలో సావిత్రి భాయి పూలే దంపతుల పోరాటం అజరామరం అని అన్నారు. అన్ని వర్గాలకు విద్యా అందించడానికి వారు నాటి ఆధిపత్య సమాజం పై అక్షర యుద్ధం చేసారని తెలిపారు. తనపై భౌతిక, మానసిక దాడికి చేసిన నాటి

అగ్ర వర్గాలకు సైతం ఆశ్రయం కల్పించారని, వారి బిడ్డలకు సైతం తన ఆశ్రమం లో వసతి కల్పించి, సపర్యలు చేసి మానవత్వానికి చిరునామా నిలిచారని కొనియాడారు. మహిళల పట్ల పెనవేసుకున్న పురుష ఆధిపత్య భావజాలాన్ని విసర్జించి, మనుషులందరూ సమానమేనే భావాన్ని ఆచరణలోకి తీసుకురావడానికి నేటి తరం యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిళలకు రాజకీయ, ఆర్థిక, విద్యా ,ఉద్యోగ, సాంస్కృతిక తదితర రంగాలలో తగిన ప్రాధినిధ్యం కల్పించడానికి పాలకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సావిత్రి భాయి పూలే దంపతుల పోరాట స్ఫూర్తితో సమానత్వ సమాజ స్థాపన లక్ష్యంతో పోరు బాట పట్టాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జార్జిరెడ్డి పి.డి.ఎస్.

# ఈవీ బ్యాటరీలకూ ఆధార్

దేశంలో విద్యుత్ వాహనాల (ఈవీ) వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, వాటిలో కీలకమైన బ్యాటరీల భద్రత, పారదర్శకత కోసం కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ వినూత్న ప్రతిపాదనను తీసుకొచ్చింది. మనకు ఆధార్ కార్డు తరహాలోనే, ప్రతి బ్యాటరీ ప్యాక్‌కు ఒక విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయించాలని నిర్ణయించింది. 'బ్యాటరీ ప్యాక్ ఆధార్ నంబరు' (బీపీఏఎన్) పేరుతో పిలిచే ఈ 21 అంకెల కోడ్ ద్వారా బ్యాటరీ తయారీ నుంచి అది రీసైక్లింగ్ అయ్యే వరకూ ప్రతి దశనూ పర్యవేక్షించవచ్చు. ఈ నూతన నిబంధనల ప్రకారం.. బ్యాటరీ ఉత్పత్తిదారులు లేదా దిగుమతిదారులు తాము మార్కెట్లోకి ప్రవేశపెట్టే ప్రతి బ్యాటరీకి తప్పనిసరిగా బీపీఏఎన్ కేటాయించాల్సి ఉంటుంది. ఇది కేవలం ఒక సంఖ్య మాత్రమే కాదు. బ్యాటరీకి సంబంధించిన సమస్త సమాచారం ఇందులో నిక్షిప్తమై ఉంటుంది. బ్యాటరీకి వాడిన ముడి పదార్థాలను ఎక్కడి నుంచి సేకరించారు, తయారీ విధానం, వినియోగం, రీసైక్లింగ్ వరకూ ప్రతి సమాచారాన్ని దీనిద్వారా తెలుసుకోవచ్చు. ఈ వివరాలన్నింటినీ ప్రభుత్వం ఏర్పాటు చేసే అధికారిక పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయడం తప్పనిసరి.



# మహిళల విద్యా విప్లవానికి నాంది పలికిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే

- **బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు,మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్**

**హన్మకొండ,జనవరి03(తెలంగాణ ముచ్చట్లు):**

భారతదేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా, అణగారిన వర్గాల మహిళల విద్యా విప్లవానికి నాంది పలికిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని శనివారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిపారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ రాష్ట్ర నేత, గ్రేటర్ వరంగల్ మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్ హాజరయ్యారు. మొదట సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన జోరిక రమేష్ మాట్లాడుతూ, "సావిత్రిబాయి పూలే భారతదేశ విద్యా చరిత్రలో విప్లవాత్మక మార్పులకు ఆద్యురాలు. పీడిత వర్గాలు, ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధి కోసం ఆమె చేసిన కృషి చిరస్థాయిగా నిలిచిపోయింది. కుల, మత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమతో చూసిన ఆమె వ్యక్తిత్వం అద్భుతమైనది. విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమని నమ్మి తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయురాలు ఆమె" అని కొనియాడారు.




ఈ వేడుకల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సల్వాజీ రవీందర్ రావు, నయీముద్దీన్, బుద్దె వెంకన్న, పొలపల్లి రామ్మూర్తి, మహమూద్ గౌస్ ఖాన్, సౌరం రఘు, సంపతి రఘు, తక్కళ్లపల్లి వినీల్ రావు, సూరసి మహేష్, దరిగి రమేష్, గద్దె పాటి సాయి కుమార్, సల్మాన్, విజయ్ రెడ్డి, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# సావిత్రిబాయి పూలే జీవిత చరిత్ర పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి

**బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బోరెల్లి సురేష్**

**హైదరాబాద్,జనవరి03(తెలంగాణ ముచ్చట్లు):**

భారతదేశంలో బడుగు బలహీన వర్గాల మహిళలకు మొదటిసారి విద్యను అందించిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే 195వ జయంతి సందర్భంగా ఆమెకు ఘన నివాళులు అర్పించారు బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బోరెల్లి సురేష్‌మరియు రాష్ట్ర కమిటీ సభ్యులు. ఈ కార్యక్రమం ఉస్మానియా విశ్వవిద్యాలయం కళాశాల ఆవరణంలో జరిగింది.

ఈ సందర్భంగా బోరెల్లి సురేష్ మాట్లాడుతూ...సావిత్రిబాయి పూలే సేవలు, త్యాగాలు సామాన్య ప్రజలకు చేరవేసే విధంగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పాఠ్యపుస్తకాల్లో ఆమె జీవిత చరిత్రను చేర్చాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత సమాజంలో ఆమె ఆలోచన విధానం, సేవా దృక్పథం ఎంతో అవసరమని, మహిళలు సేవా దృక్పథానికి దూరంగా ఉండటం వల్ల అనేక మానసిక రుగ్మతలకు గురవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. సావిత్రిబాయి పూలే జీవిత చరిత్ర ప్రతి వ్యక్తికి తెలిసేలా చేయాలంటే కేవలం పాఠ్యపుస్తకాల్లోనే ఉండాలని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విద్యా విధానంలో భారతదేశ సామాజిక ఉద్యమ నేత, మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జీవిత చరిత్రతో పాటు ఆమె పరిశోధనాత్మక అంశాలను చేర్చాలని బలంగా కోరారు




.ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవుల కిషన్, నాయకులు గుంటి ప్రభాకర్, రమేష్ బాబు, ప్రవీణ్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in